
నక్షత్ర పబ్లికేషన్స్
SIRA VELUGU
# సిరా వెలుగు
తెలుగు దినపత్రిక



తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ శుక్రవారం 06-01-2023 సంపుటి : 13 సంచిక : 30 వెల : 5/- పేజీలు 8

## కేంద్ర మంత్రివర్గ విస్తరణకు
# ముహూర్తం ఫిక్స్..!




**ఢిల్లీ :** కేంద్ర మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. ఒకటి రెండ్రోజుల్లోనే కేంద్ర కేబినెట్ విస్తరణ జరుగనుంది. త్వరలోనే దీనిపై ఓ ప్రకటన వస్తుందని సంకేతాలొస్తున్నాయి. అయితే ఎవరు ఇన్..ఎవరు ఔట్.. ప్రధాని మోడీ తన మంత్రివర్గంలో ఎవరెవరికి చోటు కల్పిస్తారనే అంశం ఆసక్తిని రేకెత్తిస్తోంది. మంత్రివర్గ విస్తరణపై ప్రధాని మోదీ ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం. మంత్రుల పనితీరు ఆధారంగా తుది జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఐతే ఈసారి ఉత్తరప్రదేశ్‌కు ప్రాధాన్యత ఉంటుందని ప్రచారం జరుగుతోంది.విస్తరణకు సమయం కూడా ఫిక్స్ అయినట్లుగా తెలుస్తోంది. జులై 7న (బుధవారం) మధ్యాహ్నం 11 గంటలకు ప్రధాని మోడీ 2.0 ప్రభుత్వం తొలిసారి కేబినెట్ విస్తరణ చేపట్టనుందని ఢిల్లీ వర్గాల అంచనా వేస్తున్నాయి. 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా మంత్రివర్గంలో మార్పులు జరుగనున్నట్లు తెలుస్తోంది. కేంద్ర కేబినెట్‌లో గరిష్టంగా 81 మంది మంత్రులను స్థానం

మిగతా 2లో

## తెలంగాణకు మరో
# భారీ పెట్టుబడి



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే పలు అంతర్జాతీయ కంపెనీలు తమ కార్యకలాపాలను రాష్ట్రంలో ప్రారంభించగా, తాజాగా గోద్రెజ్ సంస్థ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో వంట నూనెల ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు కోసం రూ. 250 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు గోద్రెజ్ సంస్థ ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ ఎండీ బలరాం సింగ్ యాదవ్

మిగతా 2లో

## ఇకపై ప్రతి స్కూల్‌లో ఇంటర్నెట్ సదుపాయం..

- విద్యా శాఖపై సీఎం జగన్ సమీక్ష..!



**హైదరాబాద్ :** ఈసందర్భంగా కీలక నిర్ణయాలునాడు-నేడు కింద స్కూళ్లలో చేస్తున్న పనులపై నిరంతరం ఆడిట్ చేయాలని అధికారులను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. ప్రతి నెలకు ఒకసారి ఆడిట్ చేయాలన్నారు. స్కూళ్లకు కల్పించిన సౌకర్యాలు ఎలా ఉన్నాయని పరిశీలన చేయాలని స్పష్టం చేశారు. పాఠశాల విద్యా శాఖపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. స్కూళ్లలో అభివృద్ధి కార్యక్రమాలపై ఆడిట్ చేసిన వివరాలను

మిగతా 2లో

## ఆర్వోబీలకు నిధుల మంజూరిలో అరవింద్ ప్రమేయం గుండు సున్నా : మంత్రి వేముల



2

## 15,730 కేజీల ట్రక్కును పళ్లతో లాగేశాడు.. గిన్నిస్ రికార్డు వీడియో చూడాల్సిందే

## మయన్మార్‌లో 7వేల మంది ఖైదీలకు క్షమాభిక్ష.. మాజీ మంత్రి, ప్రముఖ రచయితకు విముక్తి



2

## 81వేల ప్రభుత్వ ఉద్యోగాలకు రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్లు : మంత్రి హరీశ్‌రావు



**కోరుట్ల :** రాష్ట్ర ప్రభుత్వం 81వేల ప్రభుత్వ ఉద్యోగాలకు రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్లు జారీ చేస్తుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. 2023 సంవత్సరాన్ని

మిగతా 2లో

## కాంగ్రెస్‌తో బీఆర్ఎస్ పొత్తు.. 2023లో అతిపెద్ద జోక్ ఇదే: మంత్రి శ్రీనివాస్ గౌడ్

2లో



## తెలంగాణ కాంగ్రెస్ కూటమిగానా..? ఒంటరిగానా..?

4లో

## కరోనా వైరస్ కొత్త లక్షణం ఇదే..!




2లో

## కేంద్ర మంత్రివర్గ విస్తరణకు
# ముహూర్తం ఫిక్స్..!

ఉండగా, ప్రస్తుతం 53 మంది మాత్రమే ఉన్నారు. దీంతో మరో 28 మందికి మంత్రులుగా అవకాశం దక్కనుంది.కేబినెట్ విస్తరణపై గత రెండు రోజులుగా ప్రధానితో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌లతో చర్చలు జరుపుతున్నారు. కేబినెట్ విస్తరణలో ఉత్తర్‌ప్రదేశ్‌తోపాటు బీహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం లభిస్తుందని తెలుస్తుంది. ఇందులో ముగ్గురు మాజీ సీఎంలు, ఓ మాజీ డిప్యూటీ సీఎంకు చోటు లభిస్తుందని సమాచారం. ఉత్తరాఖండ్ మాజీ సీఎం తీరత్ సింగ్ రావత్, అసోం మాజీ ముఖ్యమంత్రి శర్బానంద సోనోవాల్, మహారాష్ట్ర మాజీ సీఎం నారాయణ్ రాణేలకు బెర్త్ లభించనుంది. ఉత్తరప్రదేశ్ నుంచి వరుణ్ గాంధీ, రీటా బహుగుణ జోషితో పాటు మరికొందరి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఇక మధ్యప్రదేశ్ నుంచి జ్యోతిరాదిత్య సింధియా, అస్సాం నుంచి శర్వానంద్ సోనోవాల్‌లతో పాటు బీహార్ డిప్యూటీ సీఎం సుశీల్ మోదీలకు కొత్తగా మంత్రివర్గంలో చోటు దక్కుతుందని ప్రచారం జరుగుతోంది. ఇక బీహార్, గుజరాత్‌ల ఇన్‌ఛార్జిగా ఉన్న బీజేపీ సీనియర్ నేత భూపేంద్ర యాదవ్‌కు కూడా చోటు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.
ఇక ఇటీవలే లోక్ జనశక్తి నుంచి బయటికొచ్చిన పరాస్, అప్నాదళ్ నేత అనుప్రియ పటేల్‌ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. జేడీయూ నుంచి లల్లాన్ సింగ్, రామ్‌నాథ్ ఠాకూర్, సంతోష్ కుశ్వాహాలకు అవకాశం దక్కవచ్చని తెలుస్తోంది.

## 81వేల ప్రభుత్వ ఉద్యోగాలకు
## రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్లు : మంత్రి హరీశ్‌రావు

ఉద్యోగ తెలంగాణగా ప్రభుత్వం మార్చిందని అన్నారు. గురువారం రూ. 20 కోట్లతో అప్‌గ్రేడ్ చేసిన వంద పడకల ఆస్పత్రికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ వచ్చిన నాటి నుంచి నేటి వరకూ ఒక్క వైద్య ఆరోగ్య శాఖ లో 6,431 డాక్టర్ పోస్టులు, 7600 స్టాఫ్ నర్స్ లు, 5192 పారా మెడికల్ సిబ్బంది.1900 మంది ఇతర సిబ్బంది మొత్తం 21,200 మందిని కొత్తగా నియమించామని అన్నారు.%దేశంలో కేంద్ర ప్రభుత్వ హయాంలో 6 శాతం ఉన్న నిరుద్యోగం 8.3 శాతానికి పెరిగిందని వివరించారు. తెలంగాణ లో 4.1 మాత్రమే నిరుద్యోగిత రేటు ఉందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు తెలంగాణ లో మూడే డయాలసిస్ సెంటర్లు ఉండగా ఇపుడు 122 చేశామని అన్నారు.ఇప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రతి నియోజకవర్గం కు ఒక డయాలసిస్ సెంటర్ తీసుకొచ్చామని పేర్కొన్నారు. తెలంగాణ లో 200 ఉన్న ఐసీయూ బెడ్ లను 6వేలకు పెంచామని గుర్తు చేశారు.తెలంగాణ లో 950 మంది డాక్టర్లను కొత్తగా నియమించగా ఒక్క ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 90 మంది డాక్టర్లను నియమించామని తెలిపారు. సీఎం కేసీఆర్ వైద్య ఆరోగ్య శాఖకు అధిక ప్రాధాన్యం ఇచ్చి , నిధులను పెంచి పేదలకు ఆరోగ్యం ను చేరువ చేశారని కొనియాడారు. హెల్త్ సెక్టార్ లో తెలంగాణ బెస్ట్ పెర్ఫార్మెన్స్ స్టేట్ అని కేంద్ర ప్రభుత్వ మే తేల్చిందని పేర్కొన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక వైద్య ఆరోగ్య శాఖ ముఖ చిత్రం మారిందని అన్నారు. హాజీపురలో బస్తీ దవాఖానాను , కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ను మంత్రి హరీశ్ రావు ప్రారంభించగా స్థానిక శాసన సభ్యులు విద్యాసాగర్ రావు, జిల్లా కలెక్టర్ జి రవి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తో బీఆర్ఎస్ పొత్తు.. 2023లో
## అతిపెద్ద జోక్ ఇదే: మంత్రి శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్ :** కాంగ్రెస్‌తో బీఆర్ఎస్ పొత్తు.. 2023లో అతిపెద్ద జోక్ ఇదే: మంత్రి శ్రీనివాస్ గౌడ్హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీతో బీఆర్ఎస్ పొత్తు ప్రసక్తే లేదని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. 2023లో అతిపెద్ద జోక్ ఇదేనని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటిరిగానే పోటీ చేస్తుందని వెల్లడించారు. తమకు ఎవరితో పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పోలవరం విషయంలో సీఎం కేసీఆర్ విశాల దృక్పథంతో పనిచేస్తారని తెలిపారు. పీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్కం ఠాకూర్‌ను తొలగించడం కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారమని చెప్పారు. దానితో తమకు సంబంధం లేదని వెల్లడించారు.

## ఆర్వోబీలకు నిధుల మంజూరిలో
## అరవింద్ ప్రమేయం గుండు సున్నా : మంత్రి వేముల

**నిజామాబాద్ :** జిల్లాలో రైల్వే ఓవర్ బ్రిడ్జిల మంజూరుకు తన వంతుగా కృషి చేశానని రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లాలోని భీంగల్, వేల్పూర్ మండలాల్లో జరిగిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఒప్పించి మాధవనగర్ ఆర్వోబీ మంజూరు చేయించానని తెలిపారు.
మిగతా ఆర్వోబీల మంజూరికి కేంద్ర మంత్రికి, రైల్వే బోర్డుకు పలుమార్లు లేఖలు రాశానని వెల్లడించారు. ఆర్వోబీలకు నిధులు మంజూరు చేయించానని నిజామాబాద్ ఎంపీ అరవింద్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని మండిపడ్డారు. ఒక్క అబద్ధాన్ని వంద సార్లు చెప్తే నిజం అయిపోతుంది అనే భ్రమలో ఉన్నాడని ఎద్దేవా చేశారు. జిల్లా మంత్రిగా ప్రతిపాదనలు చేసిన మిగతా నాలుగు ఆర్వోబీలకు కేంద్రం నుంచి మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు.మాధవనగర్ ఆర్వోబీకి రాష్ట్ర ప్రభుత్వం 63 కోట్లు ఖర్చు చేస్తుండగా రైల్వే శాఖ రూ. 30 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం తరుపున చేపట్టిన పనులు రెండు నెలల క్రితమే ప్రారంభం అయ్యాయని,రైల్వే తరుపున పనులు ఇంకా ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. పొరపాటున ఎంపీగా అరవింద్‌ను గెలిపిస్తే ప్రజలకు కేంద్రం నుంచి నయాపైసా సాయం చేయలేదని ఆరోపించారు. పేద ప్రజల వైద్య ఖర్చుల కింద సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు, పీఎంఆర్ఎఫ్ ద్వారా పేద ప్రజలకు ఆర్థిక సహాయం చేయాలని సూచించారు.ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుతున్న అరవింద్ మాటలను ప్రజలు నమ్మవద్దని కోరా

## ఇకపై ప్రతి స్కూల్‌లో
## ఇంటర్నెట్ సదుపాయం..

ఈసందర్భంగా సీఎంకు అధికారులు వివరించారు. అవసరమైన చోట వెంటనే పనులు, మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. స్కూళ్ల మెయింటెనెన్స్ ఫండ్‌ను వాడుకుని స్కూళ్ల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా తెలియ జేసేందుకు 14417 టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యా కానుకపై సీఎం జగన్ ఆరా తీశారు. వచ్చే ఏడాది జూన్‌లో స్కూళ్లు తెరిచే నాటికి విద్యా కానుక కింద అన్ని రకాల వస్తువులు అందించేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని చెప్పారు. స్కూళ్లు తెరిచే నాటికి పిల్లల చేతికి విద్యా కానుక కచ్చితంగా ఉండాలని ఆదేశించారు సీఎం జగన్. యూనిఫామ్స్ కుట్టు ఛార్జీలను విద్యా కానుక ప్రారంభం రోజునే తల్లుల ఖాతాల్లోకి వేయాలన్నారు.
స్కూళ్ల నిర్వహణలో పేరెంట్స్ కమిటీలను నిరంతరం యాక్టివేట్ చేయాలని తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీటిలో నాణ్యత నిర్ధారణ అంశాలను విలేజ్ క్లినిక్ పరిధిలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. వీటిపై ఎప్పటికప్పుడు విలేజ్ క్లినిక్ ద్వారా నివేదికలు పంపించాలన్నారు.° ఎం ఇచ్చిన ఆదేశాలతో స్కూళ్ల నిర్వహణలో సచివాలయ ఉద్యోగులు భాగస్వామ్యం కానున్నారు. ప్రతి వారం స్కూళ్లను ఉన్నతాధికారులు సందర్శించేలా షెడ్యూల్ తయారు చేయాలని ఆదేశించారు సీఎం జగన్. స్కూళ్ల నిర్వహణలో తమ దృష్టికి వచ్చిన అంశాలను ఫోటోగ్రాఫ్‌లతో సహా అప్‌లోడ్ చేయాలని తేల్చి చెప్పారు. టీచర్లకు, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందుకు 5 లక్షల 18 వేల 740 ట్యాబ్‌లను కొనుగోలు చేయనున్నారు.ట్యాబ్‌ల్లో బైజూస్ కంటెంట్ ఉండనుంది. తరగతి గదులను డిజిటలీకరణ చేసే కార్యక్రమంలో భాగంగా స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ టీవీలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు దాదాపు 72 వేల 481 యూనిట్లు అవసరమని అంచనా వేస్తున్నారు. డిజిటలైజేషన్ కోసం దాదాపు రూ.512 కోట్లకు పైగా ఖర్చు కానుంది. వచ్చే ఏడాది మార్చి నాటికి తొలి దశలో తరగతి గదుల డిజిటలైజేషన్ జరిగేలా చూడాలని ఇప్పటికే అధికారులకు సీఎం జగన్ ఆదేశించారు.

# తెలంగాణకు మరో భారీ పెట్టుబడి

సమావేశమై పెట్టుబడులు పెడుతున్నట్లు తెలిపారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో ప్రత్యక్షంగా 250 మందికి, పరోక్షంగా 500 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.తెలంగాణ ప్రభుత్వ పాలసీలు అద్భుతంగా ఉన్నాయని గోద్రెజ్ సంస్థ ప్రశంసించింది. ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు పామాయిల్ రైతుల కోసం 10 గోద్రెజ్ సమాధాన్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు గోద్రెజ్ కంపెనీ తెలిపింది. 2025 %-- 26 వరకు ప్లాంటును పూర్తి స్థాయిలో నడపాలని భావిస్తున్న గోద్రెజ్ సంస్థ%ౌా% గంటకు 30 టన్నుల ప్లాంటును ప్రతిపాదిస్తోంది. దాన్ని గంటకు 60 టన్నుల సామర్థ్యానికి కూడా పెంచే అవకాశం ఉందని అంటున్నారు. ఖమ్మం జిల్లాలో ఓ ప్రైవేట్ సంస్థ పెడుతున్న పెద్ద పెట్టుబడి ఇదే కానుంది. గోద్రెజ్ సంస్థ పెట్టుబడిని పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్వాగతించారు. ఆయిల్ పామ్ సాగుపై ముఖ్యమంత్రి కేసీఆర్ పెట్టిన శ్రద్ధ ఫలితాలను ఇస్తోందని అన్నారు.
ఇప్పటికే తెలంగాణ రాష్ట్రానికి ఎనిమిది ఏళ్లలో దాదాపు రూ.3 లక్షల 30 వేల కోట్లు విలువైన పెట్టుబడులు వచ్చినట్లు ఇటీవల మంత్రి కేటిఆర్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, పాలనలో పారదర్శకత, సీఎం కేసీఆర్ ఆలోచనలతో కార్యరూపం దాల్చిన టీఎస్ ఐపాస్‌తో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయని వెల్లడించారు.
రాష్ట్రానికి ఈ స్థాయిలో పెట్టుబడులు రావడం తమ ప్రభుత్వం సాధించిన ఘన విజయమని ప్రకటించారు మైనింగ్, రియల్ ఎస్టేట్, లాజిస్టిక్స్, ఆతిథ్యం, ఇతర రంగాల్లోకి వచ్చిన పెట్టుబడులన్నీ కలిపితే వాటి విలువ మరింత పెరుగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ కృషితో లక్షలాది మందికి ఉపాధి లభించిందని మంత్రి అన్నారు.

**నేడు మునుగోడు, హుజుర్‌నగర్‌లో పర్యటించనున్న మంత్రి కేటీఆర్**

మునుగోడు, హుజుర్‌నగర్‌లో పర్యటించనున్న మంత్రి కేటీఆర్
హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్.. విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డితో కలిసి గురువారం హుజుర్‌నగర్, మునుగోడు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

**మంత్రి కేటీఆర్ పర్యటన ఇలా..**

-ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి.. ఉదయం 10:50 గంటలకు హుజూర్ నగర్ పట్టణానికి చేరుకుంటారు.
-ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హుజూర్ నగర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద స్థానిక ఎమ్మెల్యే సైదిరెడ్డితో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు.
-మధ్యాహ్నం 12:30 గంటలకు గ్రీన్ వుడ్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొంటారు.
-మధ్యాహ్నం 1:45 గంటలకు హుజూర్ నగర్ ఎమ్మెల్యే సైదిరెడ్డి నివాసంలో లంచ్ చేస్తారు.
-మధ్యాహ్నం 2:30 గంటలకు హుజూర్ నగర్ పట్టణం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి.. మధ్యాహ్నం 3 గంటలకు మునుగోడు నియోజకవర్గంలోని చండూర్ టౌన్‌కు చేరుకుంటారు.
-మధ్యాహ్నం 3:30 గంటలకు గట్టుప్పల్ మండల కేంద్రంలో క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ప్రారంభిస్తారు.
-సాయంత్రం 4:30 గంటలకు చండూరు పట్టణానికి చేరుకుంటారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు.
-సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ తిరిగి ప్రయాణం అవుతారు.

కామారెడ్డి మాస్టర్ ప్లాన్ నిరసనలపై మంత్రి కేటీఆర్ స్పందించారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో పట్టణ ప్రగతి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లాలో నెలకొన్న పరిస్థితులను ఆ జిల్లా అదనపు కలెక్టర్‌ను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు.
కేవలం మాస్టర్ ప్లాన్ ముసాయిదా మాత్రమే ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. ప్రజల కోణంలోనే ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. అభ్యంతరాలు ఉంటే ముసాయిదాలో మార్పులు చేస్తామని ప్రకటించారు. వినతులు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.
ప్రజలకు అన్ని విషయాలు వివరించాలని సూచించారు. 500 ఎకరాలు ఇండస్ట్రీయల్ జోన్‌కు పోతోందని ఆందోళన చెందుతున్నారు. భూమి పోతుందని ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు పత్రికల్లో చూశానని తెలిపారు. ఈ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టేందుకు లేదని స్పష్టం చేశారు. నిర్మాణాత్మక నగరాలు, పట్టణాల అభివృద్ధి కోసమే మాస్టర్ ప్లాన్ చేశామన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రజలకు అనుకూలంగా ఉండాలి.. వ్యతిరేకంగా ఉండొద్దు అని కేటీఆర్ పేర్కొన్నారు.

## మయన్మార్‌లో 7వేల మంది ఖైదీలకు
## క్షమాభిక్ష.. మాజీ మంత్రి, ప్రముఖ రచయితకు విముక్తి

మయన్మార్: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మయన్మార్ ఆర్మీ 7వేల మందికి పైగా ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించింది. వీళ్లలో మాజీ మంత్రి థుర అంగ్ కో, ప్రముఖ రచయిత తిన్ లిన్ వూ కూడా ఉన్నారు. అయితే.. విడుదలైన వాళ్లలో ఆంగ్ సాన్ సూకీ, మాజీ అధ్యక్షుడు విన్ మియింట్ ఉన్నారా? అనేది మాత్రం మయన్మార్ ఆర్మీ వెల్లడించలేదు. థుర, థిన్ లిన్ ఇద్దరూ.. ఆంగ్ సాన్ సూకీ ప్రభుత్వంలో పనిచేశారు. సూకీకి చెందిన నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ పార్టీలో తిన్ లిన్ అధికారిగా విధులు నిర్వహించారు. 'నేను జైలు నుంచి ఇంటికి వచ్చాను. అయితే.. నేనింకా స్వేచ్ఛా జీవిని కాదు. ఎందుకంటే.. ఇది నిజమైన స్వేచ్ఛ కాదు. ఇంటి దగ్గర ఉన్నా ఇప్పటికీ నాకు భయంగానే ఉంది' అని తిన్ తెలిపారు. ఏళ్లుగా జైళ్లలో మగ్గుతున్న రాజకీయ ఖైదీలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై కుట్ర పన్నారని, ప్రజలను రెచ్చగొట్టారనే ఆరోపణల మీద తిన్ లిన్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధించారు.
ఈ రోజున (జనవరి 5న) మయన్మార్‌లో 75వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. దాంతో, రాజకీయ ఖైదీలుగా ఉన్నవాళ్లలో 7,012 మందిని మయన్మార్ సైన్యం జైలు నుంచి విడుదల చేసింది. మయన్మార్ సైన్యం 2021 ఫిబ్రవరి1న ఆంగ్‌సాన్ సూకీని గద్దెదించింది. ఆమెతో పాటు ఇతర అధికారులు, నిరసనకారులను అరెస్ట్ చేసింది. అప్పటి నుంచి ఆ దేశంలో అల్లర్లు చెలరేగుతున్నాయి. హింసను విడనాడాలని, రాజకీక ఖైదీలను వెంటనే విడుదల చేయాలని పోయిన ఏడాది ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి డిమాండ్ చేసింది. అవినీతి ఆరోపణల కేసులో ఆంగ్‌సాన్ సూకీకి మయన్మార్ సైన్యం ఏడేళ్లకు పైగా శిక్ష విధించింది.


## చైనాలో సెలబ్రిటీల మరణం..
## కోవిడ్ మృతుల సంఖ్యపై ఆందోళన




**బీజింగ్:** చైనా రాజధాని బీజింగ్‌లో దాదాపు హాస్పిటళ్లు అన్నీ ఫుల్ అయ్యాయి. కోవిడ్ లక్షణాలతో హాస్పిటళ్లలో చేరుతున్న వారి సంఖ్య గంటగంటకు పెరుగుతోంది. అయితే పాపులర్ వ్యక్తుల మరణాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి రావడం ఇప్పుడు అక్కడ కొంత ఆందోళనకర పరిస్థితిని క్రియేట్ చేస్తోంది. 40 ఏళ్ల మేటి ఒపెరా సింగర్ చూ లాన్‌లన్ మరణించినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో చాలా మంది భయాందోళనలకు గురవుతున్నారు. అసలు అధికారికంగా కోవిడ్ మృతుల లెక్క ఎంత ఉంటుందో అని భయపడుతున్నారు.గత డిసెంబర్‌లో కోవిడ్ జీరో పాలసీని చైనా ఎత్తివేసింది. దాంతో అక్కడ ఒక్కసారిగా మళ్లీ కోవిడ్ పాజిటివ్ కేసులు పెరిగాయి. హాస్పిటళ్లు, శ్మశానవాటికలు మళ్లీ కిక్కిరిసిపోతున్నాయి. రోజువారీ కేసుల వివరాలను వెల్లడించేందుకు చైనా నిరాకరిస్తోంది. డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు కేవలం 22 మంది మాత్రమే చనిపోయినట్లు ఆ దేశం పేర్కొన్నది. కేవలం శ్వాసకోస ఇబ్బందులు, న్యూమోనియా లాంటి కేసుల్ని మాత్రం లెక్కిస్తున్నారు. చూ లాన్‌లన్ లాంటి పబ్లిక్ ఫిగర్ల మృతి కలవరం రేపింది. ఇక మృతుల లెక్కలపై ప్రభుత్వం ఇస్తున్న అధికారిక లెక్కలపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.
న్యూ ఇయర్ రోజున నటుడు గాంగ్ జిన్‌టాంగ్ మరణం కూడా చైనా ఇంటర్నెట్ యూజర్లను తెగ ఆందోళనకు గురి చేసింది. ఫాదర్ కాంగ్ పాత్రతో గాంగ్ టీవీ ప్రేక్షకుల్ని ఆకర్షించారు. మాజీ జర్నలిస్టు, నాన్‌జింగ్ వర్సిటీ ప్రొఫెసర్ హూ ఫూమింగ్ జనవరి రెండో తేదీన మరణించారు. డిసెంబర్ 21 నుంచి 26వ తేదీ వరకు దేశంలోని టాప్ సైన్స్, ఇంజనీరింగ్ సైంటిస్టులు 16 మంది చనిపోయినట్లు చైనా మీడియా తెలిపింది. నిజానికి వీళ్ల మరణాలకు కోవిడ్ కారణమని ఎక్కడా చెప్పకపోయినా.. ఇంటర్నెట్ యూజర్లు మాత్రం ఆ డౌట్స్‌ను వ్యక్తం చేస్తున్నారు.

## జీవో-1పై పవన్ ఫైర్..
# జగన్కు సూటి ప్రశ్న!

**హైదరాబాద్:** ఏపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో 1/2023 తీవ్ర వివాదంగా మారిన విషయం తెలిసిందే. దీనిని కేవలం ప్రతిపక్షాలను అడ్డుకునేందుకు మాత్రమే తీసుకువచ్చారని ఆయా పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. ఇక కుప్పంలో చంద్రబాబును కూడా ఇదే జీవోను చూపించి పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సదరు జీవోపై జనసేనాని పవన్ కళ్యాణ్.. తనదైన శైలిలో రియాక్ట్ అయ్యారు.జీవో1 పేరుతో ఆంక్షలు విధించటంపై ఆయన స్పందించారు. ఆంక్షల పేరుతో చంద్రబాబు కుప్పం పర్యటనను అడ్డుకున్నారని జగన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇలాంటి ఆంక్షలు ఉంటే పాదయాత్ర కొనసాగేదా అని ప్రశ్నించారు. "ప్రతిపక్షాల గొంతు వినిపించకూడదు.. ఎటువంటి కార్యక్రమాలు నిర్వహిం చకూడదనే ఉద్దేశ్యంతోనే.. జీవో 1ని తీసుకొచ్చారు" అని పవన్ వ్యాఖ్యానించారు.చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటించటం ఆయన డ్యూటీ.. దానిని జీవోల పేరిట అడ్డుకుంటారా అని పవన్ నిలదీశారు. జీవోల పేరు చెప్పి చంద్రబాబు కుప్పం పర్యటన చేయకుండా అడ్డుకున్నారని విమర్శించారు. ఇవే జీవోల ఆంక్షలు జగన్రెడ్డికి వర్తించవా అని ప్రశ్నించారు. రాజమహేంద్రవరంలో జగన్ పర్యటన జీవో ఉల్లంఘన కిందకు వస్తుందో రాదో పోలీసులు



వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి ప్రజా వ్యతిరేక విధానాలు చేస్తుంటే ప్రశ్నించటం ప్రతిపక్షంగా తమ బాధ్యత అని పవన్ అన్నారు. చీకటి ఉత్వర్వులు ఇవ్వకుండానే గతంలో.. ఇందులోని దురుద్దేశాలను చూపించారని విమర్శించారు. విశాఖ నగరంలో హొటల్ నుంచి బయటకు రాకూడదని.. ప్రజలకు అభివాదం చేయకూడదని నిర్బంధాలు విధించారని నాటి సంఘటనను పవన్ గుర్తు చేసుకున్నారు.

## 15,730 కేజీల ట్రక్కును
## పళ్లతో లాగేశాడు.. గిన్నిస్
## రికార్డు వీడియో చూడాల్సిందే




కైరో: ఈజిప్టుకు చెందిన అష్రఫ్ సులేమాన్.. కొత్త రికార్డు క్రియేట్ చేశాడు. రోమాలు నిక్కపొడిచే రీతిలో స్టంట్ చేశారు. సుమారు 15,730 కేజీల బరువు ఉన్న ఓ భారీ ట్రక్కును అతను ఈజీగా తన దంతాలతో లాగేశాడు. దీంతో అతను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. భారీ వాహనాన్ని పళ్లతో లాగేసిన రికార్డును సొంతం చేసుకున్నారు. తన ఇన్‌స్టాగ్రామ్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ఈ వీడియోను పోస్టు చేసింది.ఈజిప్ట రోడ్లపై సులేమాన్ తన దంతాలకు.. ట్రక్కుకు ఓ తాడిని కట్టి లాగాడు.అయితే ఈ వీడియో నెటిజన్ల దృష్టిలో పడింది. 2021 జూన్ 13వ తేదీన సులేమాన్ ఆ రికార్డును క్రియేట్ చేసినట్లు గిన్నిస్ బుక్ పేర్కొన్నది.రెండు రోజుల క్రితమే ఈ వీడియోను షేర్ చేశారు. ఇప్పటికే దానికి 4 లక్షల వ్యూవ్స్ వచ్చాయి.

## కరోనా వైరస్
## కొత్త లక్షణం ఇదే..!

కరోనా వైరస్.. మూడేళ్లుగా ప్రపంచాన్ని వణికిస్తోంది. మధ్యలో కాస్త శాంతించినట్లు కనిపించిన ఈ మహమ్మారి కొత్త వేరియంట్లతో ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. అయితే కొవిడ్‌ను గుర్తించేందుకు ఇప్పటి వరకు కొన్ని సాధారణ లక్షణాలు ఉన్నాయి. ఇప్పటి వరకు వచ్చిన ఆల్ఫా, డెల్టా వేరియంట్లలో ముక్కు కారడం, రుచి, వాసన కోల్పోవడం, విపరీతమైన తలనొప్పి, ఒళ్లు నొప్పులు, జ్వరం, గొంతునొప్పి ప్రధాన లక్షణాలుగా పరిగణించారు.
కాగా, ప్రస్తుతం శీతాకాలం కావడంతో మరోసారి వైరస్ కేసులు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఒమిక్రాన్ సబ్ వేరియంట్ ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలు వైరస్ యొక్క కొత్త లక్షణాలను కనుగొన్నారు. అదే 'మైయాల్జియా. గత లక్షణాలతో పోలిస్తే 'మైయాల్జియా పూర్తి భిన్నంగా ఉన్నట్లు జో కొవిడ్ స్టడీ యాప్ నివేదిక ద్వారా వెల్లడైంది. కండరాలలో నొప్పి ప్రారంభమవడమే వైరస్ ఇన్‌ఫెక్షన్‌కు ప్రధాన సంకేతం.
కొవిడ్ సోకిన వారిలో కండరాల నొప్పి కనీసం మూడు నుంచి నాలుగు రోజుల పాటు ఇబ్బంది పెడుతుంది. వీటితోపాటు ఇతర కొవిడ్ లక్షణాలు కూడా కనిపిస్తాయి.

**మైయాల్జియా అంటే..?**

కండరాలలో, ముఖ్యంగా కీళ్లలో విపరీతమైన నొప్పి రావడాన్నే 'మైయాల్జియా' అంటారు. మీ శరీరంలోని రోగనిరోధక శక్తి ఇన్‌ఫెక్షన్‌తో ఎంతవరకు పోరాడుతుందనే దానిపై నొప్పి ఆధారపడి ఉంటుంది. ఇన్‌ఫెక్షన్ సోకినవారు తరచుగా భుజాల నొప్పి, కాళ్ళ నొప్పితో ఇబ్బంది పడతారు. దీన్నే 'కొవిడ్ సంబంధిత కండరాల నొప్పి' అని కూడా పిలుస్తారు. ఇది మనిషి కదలికలపై తీవ్ర ప్రభావం చూపుతూ అసౌకర్యానికి గురిచేస్తుంది. 'మైయాల్జియా' అనేది దీర్ఘకాలిక లేదా స్వల్పకాలిక నొప్పితో రావచ్చు అని నివేదికలు చెబుతున్నాయి. మీరు పనిచేస్తున్నప్పుడే కాదు.. విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు కూడా ఈ నొప్పి మిమ్మల్ని బాధించొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

## ఎడిటోరియల్

# కబళింపు యత్నాల తీరు ఒక్కటే



ఉక్రెయిన్, తైవాన్‌లు తమ దేశ అంతర్భాగాలని రష్యా, చైనాలు వాదిస్తున్నాయి. సోవియట్ యూనియన్ విడిపోయి నప్పుడు ఉక్రెయిన్, చైనా నుంచి వేరు పడి నప్పుడు తైవాన్ స్వతంత్ర దేశాలుగా మనుగడ సాగి స్తున్నాయి. పొరుగు దేశాల భూభాగాలను కబళించా లన్న విషయంలో రష్యా, చైనా రెండూ ఒకే తీరులో వ్యవరిస్తున్నాయి. దాంతో తైవాన్‌లోని యువకులు ఎప్పటికైనా చైనా తమ దేశాన్ని కబళిస్తుందేమోనన్న భయంతో ఉన్నారు. ఉక్రెయిన్-రష్యాల మధ్య యుద్ధం లో రష్యా ఓడిపోవాలని కోరుకుంటున్నారు. ఉక్రెయిన్‌పై పదిమాసాలకు పైగా దాడులు జరుపుతున్న రష్యన్ సైనికులకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఉక్రెయిన్ దళాలకు తోడ్పాటునందించేందుకు ముందుకు వస్తు న్నారు. ఇప్పటికే వేలాదిమంది ఉక్రెయిన్ సైన్యానికి బాసట నిలిచారు. వీరిలో పలువురు అసువులు బాసారు. ఉక్రెయిన్‌కి సైనికంగా తోడ్పాటునందిస్తున్న దేశాల్లో తైవాన్ సైనికులే ఎక్కువమంది ఉన్నారు. ఉక్రెయిన్ ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన హీరోగా తైవాన్ కి చెందిన త్సెంగ్ జంగ్‌కి అశ్రు నివాళి అర్పించేందుకు ఇటీవల జరిగిన సమావేశానికి అతడి తల్లి కూడా హాజర య్యారు.

స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం పోరాడుతున్న ప్రజల కోసం తన కుమారుడు ప్రాణత్యాగం చేసినందుకు ఎంతో గర్విస్తున్నానంటూ ఆమె అతడి సమాధివద్ద అశ్రు నివాళిలర్పించారు. ఆమె మాత్రమే కాదు, ఎంతోమంది తైవాన్ మహిళలు చైనా దాష్టీకాలను నిరసిస్తూ తమ బిడ్డలను సైన్యంలో చేరాల్సిందిగా ప్రోత్సహిస్తున్నారు. మాతృదేశ రక్షణ కోసం ఉక్రెయిన్లు చేస్తున్నత్యాగాలను వారు చాలా ఘనంగా పేర్కొంటున్నారు. రష్యా మాదిరి గానే చైనాకూడా తమ దేశంపై విరుచుకుని పడుతుం దేమోనన్న బెదురు, భయం తైవాన్ ప్రజల్లో ఉంది. రష్యాకు చైనా అన్ని విధాలా సాయపడుతున్న సంగతి బహిరంగ రహస్యమే. ఉక్రెయిన్‌ని రష్యా సొంతం చేసు కుంటే తదుపరి చర్యగా, చైనా తైవాన్‌ని ఆక్రమిం చుకోవడానికి ప్రయత్నించవచ్చు. అప్పుడు చైనాకు రష్యా అన్ని విధాల సాయపడవచ్చు. దీనిపై చైనీస్ నాయకులు ఇప్పటికే బహిరంగ ప్రకటనలు చేశారు. చేస్తున్నారు. సోవియట్ యూనియన్ విడిపోవడంలో ఉక్రెయిన్ ప్రజల పాత్ర ఏమీ లేదు. దాని మాదిరిగా ఇంకా చాలా ప్రాంతాలు స్వతంత్ర రి పబ్లిక్‌లుగా ఏర్పడ్డా యి. వాటిలో కొన్ని రష్యాకు దాసోహమయ్యాయి. ఉక్రెయిన్ మాత్రం రష్యాకు లొంగకపోవడమే కాకుం డా, నాటో కూటమిలో చేరేందుకు ప్రయత్నాలు జరుపు తోంది.

తమ దేశం ప్రాదేశిక భద్రతను కాపాడుకునేందుకే నాటో కూటమిలో చేరాలనుకుంటున్నట్టు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెనిస్కీ చాలాసార్లు ప్రకటించారు. నాటో కూటమి అమెరికా నేతృత్వంలో పనిచేస్తోంది కావున, అమెరికాయే ఉక్రెయిన్‌ను తమ దేశం నుండి వేరు చేయాలని చూస్తోందని రష్యా ఆరోపణ. తమ శత్రువు పంచన చేరి తమ దేశంపై కవ్వింపులకు పాల్పడుతు న్నందునే ఉక్రెయిన్‌పై దాడి చేయాల్సి వచ్చినట్టు రష్యా చాలా సందర్భాల్లో ప్రకటించింది. ఉక్రెయిన్ మాదిరిగా తోక జాడించడానికి సిద్ధంగా ఉన్న దేశాల పని పడతా మని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇప్పటికే ప్రకటిం చారు. అమెరికా, దాని మిత్ర దేశాల అండ లేకపోతే ఉక్రెయిన్ తమదేశంతో తలపడలేదన్న విషయం రష్యాకు తెలుసు. అలాగే, ఉక్రెయిన్‌ని నిలువరించ లేకపోతే రష్యా మరింతగా రెచ్చిపోతుందేమోనని అమె రికా అనుమానిస్తోంది. ఉక్రెయిన్-రష్యాల మధ్య పర స్పరం దాడులుగా ప్రారంభమైన ఈ యుద్ధం వల్ల ఇప్ప టికే ప్రపంచంలోని పలు దేశాలు ఆర్థిక, చమురు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. రష్యాకి చెక్ పెట్టేందుకు నాటో దేశాలు, రష్యా వ్యతి రేక దేశాలు జతకట్టాయి. ఈ నేపథ్యంలో చిన్న దేశాలు నలిగి పోతున్నాయి. ఈ యుద్ధంలో చైనా చాలా దుష్టమైన పాత్ర వహిస్తోంది.

పనిలో పనిగా తైవాన్‌ని కబళించేందుకు ఇప్పటికే పలు చర్యలు తీసుకుంది. దీనిని గ్రహించే అమెరికా చట్టసభ అధ్యక్షురాలు న్యాన్సీ పెలోసీ ఆమధ్య తైవాన్‌ని సందర్శించారు. ఆమె వచ్చి వెళ్ళిన తర్వాత తైవాన్ జల సంధిలో చైనా యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తోంది. చైనా తో ప్రచ్ఛన్న యుద్ధానికి తలపడడం తమ అభిమతం కాదని అమెరికా అధ్యక్షుడు బిడెన్ ప్రకటిస్తూనే ఉక్రెయిన్‌కి సాయమందించే దేశాలకు తమ దేశం అండగా ఉంటుందని ప్రకటించారు. అంటే తైవాన్‌పై ఈగ వాలినా సహించబోమని ఆయన చెప్పకనే చెప్పా రు. అమెరికా హెచ్చరికలను పరిగణనలోకి తీసుకున్న చైనా తైవాన్‌పైకి హెలికాప్టర్లనూ, డ్రోన్లను పంపిస్తోంది. అమెరికా అండ ఉంది కనుకనే తైవాన్ చైనాని ఎదిరించగలుగుతోంది.

# మాంద్యం తీవ్ర ప్రభావం



ప్రపంచంలో మూడింట ఒకవంతు ప్రజానీకం ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడటం ఖాయమని అంతర్జాతీ య ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) అంచనా వేసింది. కొత్త సంవత్సరంలో కొత్త విషయాలను చెప్పి ప్రజలను ఆనందింప జేయాల్సిన అంతర్జాతీయ ఆర్థికసంస్థ ఈ వార్తను మోసు కుని వచ్చి కోట్లాది ప్రజలను ఉస్సూరుమనిపించింది. అమెరికా, యూరోపియన్ యూనియన్‌లలో పరిస్థితి గత ఏడాది కన్నా మరింత తీవ్రంగా ఉండవచ్చని ఐఎం ఎఫ్ పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం పెరగడానికి ఉక్రెయిన్‌పై రష్యాజరుపుతున్న దాడి ప్రధాన కారణమన్నది వాస్తవమే కానీ, చైనాలో కరోనా మళ్ళీ తిరగబెట్టడం, అక్కడి తయారీ రంగం పూర్తిగా దెబ్బతినడం ఒక కారణంగా భావించవచ్చు. మన దేశంలో తయారీ రంగం కొద్దిగా కోలుకున్నా రష్యా దిగుమతుల పై ఆధారపడిన ఇతర రంగాల్లో పరిస్థితి దారుణంగానే ఉంది. పాకిస్తాన్ తరహాలో ఆర్థిక మాంద్యంలోకి నెట్ట బడిన శ్రీలంకలో పరిస్థితి భారత్ ఇచ్చిన సహాయంతో కొంత తేరుకుంది. ఐఎంఎఫ్ అధినేత్రి క్రిష్టినా జార్జియేవా ఆదివారం అమెరికాకి చెందిన ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమెరికా, బ్రిటన్‌లలో కూడా పరిస్థితి ఏమంత సవ్యంగా లేదని అన్నారు. అగ్రరాజ్యంలో కూడా కోట్లాది మందిపై మాంద్యం ప్రభావం ఉందని ఆమె అన్నారు. అమెరికా ఎక్కువగా చైనా దిగుమతులపై ఆధారపడిందనీ, చైనాలో పరిస్థితి దిగజారడంతో దాని ప్రభావం అన్ని దేశాల్లోనూ స్పష్టంగా కనిపిస్తోందని ఆమె అన్నారు.

భారత్‌లో పరిస్థితి క్రమంగా మెరుగవుతున్న తరుణంలో మళ్ళీ కరోనా విజృంభించడం ఆందోళన కలిగించే విషయం. మన దేశంలో తరచూ జరిగే ఎన్నికలవల్ల ఆర్థిక వ్యవస్థ పై వాటి ప్రభావం కనిపిస్తోంది. ఏదో ఒక ప్రాంతంలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇటీవల గుజరాత్, ఢిల్లి, హిమాచల్ ప్రదేశ్‌లలో జరిగిన ఎన్నికల్లో కోట్లాది రూపాయిలు చేతులు మారాయి. నల్ల ధనాన్ని అరికడితామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అది ప్రభుత్వం వల్ల కావడం లేదు. తీసుకున్న రుణాలను చెల్లించడంలో విఫలమవుతున్న కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేక పోతోంది. మొండి బకాయిలనేవి మనం ఎంతో గొప్పగా చెప్పుకునే అమెరికాలో సైతం ప్రభుత్వ ఆర్థికవ్యవస్థపై గుదిబండగా మారాయి. అమెరికా అధ్యక్షుడు బిడెన్ దేశంలో ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడంలో విఫలమయ్యారనే మాట అందరిలోనూ వినిపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వృద్ధి రేటు 2021 నుంచి పరిశీలిస్తే క్రమంగా తగ్గుతోంది. దీనికి కోవిడ్ వ్యాప్తి కారణంగా చెబుతున్నా, వివిధ దేశాల్లో ప్రభుత్వాలు అందిస్తున్న పథకాల్లో అవి నీతి, సంపన్న వర్గాల చేతుల్లోకి ఈ పథకాల సొమ్ము చేరడం మొదలైన అంశాలే కారణమని ప్రపంచ ఆర్థిక సంస్థ అంచనా వేసింది.

చమురు ఉత్పత్తి దేశాలు అనుసరిస్తు న్న వైఖరి వర్ధమాన, అభివృద్ధి చెం దుతున్న దేశాల్లో ఆర్థిక మాంద్యాన్ని సృష్టిస్తున్నది. చైనాలో జీరో కోవిడ్ విధానంపై వెల్లువెత్తిన నిరసనల కారణంగా ఆర్థిక, వాణిజ్య రంగాల్లో పరిస్థితి దెబ్బతినడంతోనూ, ప్రజల నుంచి వ్యతిరేకత వెల్లువెత్తడంతోనూ జీరో కోవిడ్ విధానాన్ని చైనా ఎత్తేసింది. దాని ప్రభావంతో లక్షలాది కేసులు కొత్తగా నమోదవుతున్నాయి. దీని ప్రభావం చైనా ఆర్థికవిధానంపై పడవచ్చు. చైనాలో పరిస్థితిని మనకు అనుకూలంగా మలుచుకునేందుకు భారత కమ్యూనికేషన్ల రంగం ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుం ది. మన దేశంలో మొబైల్ ఫోన్ల ఎగుమతిని 49 వేల కోట్ల నుంచి లక్షకోట్లకు పెంచాలన్న లక్ష్యంతో టెలికమ్యూనికే షన్ శాఖ పని చేస్తోంది. చైనాలో ప్రస్తుతం నెలకున్న పరిస్థితులను బట్టి మొబైల్, కంప్యూటర్ రంగాల్లో మన ఉత్పత్తులను పెంచుకోవాలన్న లక్ష్యాలను ప్రధాని నిర్దే శించినట్టు ఐటి శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. ఐటి రంగంలో ఎగుమతులను రెట్టింపు చేయాల న్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్టు ఆయన చెప్పారు. మరో ఐదేళ్ల వరకూ టెక్ ఆధారిత స్టార్టప్ కంపెనీలకు ఎటువంటి ఢోకా ఉండదని ఆయన స్పష్టం చేశారు. అలాగే, ఇతర రంగాల్లో సాంకేతిక విలువలను మెరుగు పర్చు కుంటూ అంతర్జాతీయ మార్కెట్‌లలో మన వస్తువులకు గిరాకీ పెంచేందుకు మన కమ్యూనికేషన్ల రంగం కృషి చేస్తోంది. అంతర్జాతీయంగా మాంద్యం ప్రభావం మన దేశంపై పడకుండా ఐటి రంగాన్నీ, కమ్యూనికేషన్ల రంగా న్ని బాగా ప్రోత్సహిస్తోంది. ప్యాసింజర్ కార్ల విక్రయాల్లో 23 శాతం వృద్ధి సాధించడం కూడా మనదేశానికి సంబం ధించి శుభ పరిణామమే. మేక్ ఇన్ ఇండియా కార్యక్ర మం వల్ల కూడా ఇతర దేశాల ప్రభావం నుంచి బయట పడేందుకు ప్రయత్నిస్తోంది. ఆర్థిక మాంద్యం ప్రపంచ దేశాలను ఊపేస్తున్నప్పటికీ భారత్ జి-23 దేశాల కూటమి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించడం చాలా గొప్ప విషయమే. ఈ విషయాన్ని విదేశాంగ మంత్రి జైశంకర్ అంతర్జాతీయ వేదికలపై స్పష్టం చేసి భారత సంస్కృతికి అనుగుణంగానే ఉందన్నారు.

# ప్రకృతి విపత్తులు స్వయంకృతం




భూతాపం పెరగడం, పర్యావరణ అసమతుల్యత, వాతావరణ మార్పులు వంటి కారణాలవల్లే ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయి. మానవ తప్పిదాలే ఈ పరిస్థితికి కారణం. ప్రస్తుతం అమెరికాను కుదిపేస్తున్న బాంబ్ మంచుతుపాను సృష్టిస్తున్న కల్లోలానికి కూడా పరోక్షంగా ఈ పరిస్థితులే కారణం. గడచిన వందేళ్ళలో కనీవినీ ఎరుగని మంచు తుపాను అమెరికాను అతలాకు తలం చేస్తోంది. అనేక రాష్ట్రాల్లో వాహనాలన్నీ మంచుతో కప్పబడి పెద్ద కొండల్లా కనిపిస్తున్నాయి. ఇళ్ళపై మంచు గుట్టలు పేరుకుని పోయాయి. ఎక్కడి వారు అక్కడే బందీలైనారు. న్యూయార్క్‌వద్ద బఫెలో సమీపంలోని నయాగరా జలపాతాన్ని చూడటానికి వెళ్ళిన పర్యా టకులు మంచు గుట్టల్లో చిక్కుకునిపోయారు. ఆంధ్రప్రదేశ్‌లోని పెద నందిపాడు సమీపంలోని ఒక గ్రామానికి చెందిన నారా యణ,అతడి భార్య ఇద్దరూ మంచు తుపాను కారణంగా గడ్డకట్టిన సరస్సుపై నడుస్తూ ప్రాణాలు కోల్పోయారు. అలాగే, విశాఖ, రాయలసీమ ప్రాంతాలకు చెందినవారు కూడా ఈ మంచు తుపానులో చిక్కుకున్నారు. బఫెలో ప్రాంతంలో జనం ఆహారం లేక మాడిపోతున్నారు. ఒక్కొక్కరిది ఒక కథ.. ఒక్కో వ్యథ.

అమెరికా అంటే భూతల స్వర్గంగా భావించేవారు ఈ మంచుతుపాను బీభత్సపు వార్తలు, చిత్రాలను చూసి అవాక్కవు తున్నారు. బంధుమిత్రుల క్షేమ సమాచారం కోసం ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు. సమాచారం అందని వారు తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారు. మంచు తుపాను కష్టాలు అను భవిస్తున్న వారిలో ప్రవాస భారతీ యులు ఎక్కువ మంది ఉన్నారు. వారిలో తెలుగువారి సంఖ్య అత్యధికం. ఈ మంచు తుపానుకు బాంబ్ సైక్లోన్ అని పేరు పెట్టారు. న్యూయార్క్ నగరంలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ ఎక్కువ మరణాలు సంభవించినట్టు అధి కారులు తెలియ జేశారు. న్యూయార్క్ పశ్చిమ ప్రాంతం లో 8 అడుగుల లోతున మంచులో కూరుకునిపోయి కొందరు మరణించినట్టు అనుమానిస్తున్నారు. ఎడతెరి పిలేని మంచు వర్షంవల్ల ప్రజలు వీధుల్లోకి రాలేకపో తున్నారు. నిత్యావసరాలు నిండుకోవడంతో ఇళ్లల్లో ఉండలేకపో తున్నారు. వారిని ఆదుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదని న్యూయార్క్ గవర్నర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది జీవిత కాలంలో ఒకసారి వచ్చే మంచు తుపాను అని ఆయన అన్నారు. దేశ వ్యాప్తంగా 15 వేల విమానాలు రద్దయ్యాయి.

%దేశం లోని హైవేలన్నీ మూసివేశారు. దీంతో చికాగో, డెన్వర్, డెట్రాయెట్, న్యూయార్క్, అట్లాంటా తదితర విమా నాశ్రయాల్లో అనేక మంది ప్రయాణీకులు చిక్కు బడిపోయారు. వివిధ రాష్ట్రాలలో ప్రజలు డీప్ ఫ్రిజ్‌లో ఉన్నట్టు కాలం గడుపు తున్నారని నేషనల్ వెదర్ సర్వీసెస్ తెలియజేసింది. కొలరాడో, కెంటకీ, మిస్సోరీ, ఓహియా తదితర రాష్ట్రా ల్లో రెండు లక్షల మందిపైగా విద్యుత్ సరఫరా లేక నానా యాతనలు పడుతున్నారు. 48 రాష్ట్రాల్లో మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. అనేక ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు 18 అడుగుల మంచులో కూరుకుని పోవడంతో విద్యుత్ పునరుద్ధరణ ఎప్పటికి సాధ్యమవుతుందో చెప్పలేని పరిస్థితి. ఎప్పటికి వస్తుందో చెప్పలేని పరిస్థితి. ఆర్కిటిక్ బ్లాస్ట్ కారణంగా ఈ శీతాకాలంలో ఎన్నడూ లేని విధంగా తుపాను బీభత్సం దేశంలోని పలు ప్రాంతాలను గిజగిజ లాడిస్తోంది. తుపాను ప్రభావం ఈ ఏడాది క్రిస్మస్ సంబ రాలపైనా పడింది. రోడ్లపైనా, రన్‌వేల పైనా మంచు గుట్టలుగా పేరుకునిపోయింది. ప్రజలెవరూ వీధుల్లోకి రావద్దని అధికారులు పదే పదే హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

పర్యావరణ పరి రక్షణ, భూతాపం వంటి అంశాలపై అంతర్జాతీయ సదస్సులు నిర్వహించి తీర్మానాలు ఆమోదించే సంపన్న దేశాలు పర్యావరణ పరిరక్షణపై వీసమెత్తు శ్రద్ధ చూపక పోవడం వల్లనే ఈ తుపానులు, వాతావరణ ప్రతికూల పరిస్థితులు ఏర్పడు తున్నాయని శాస్త్రవేత్తలు చెబు తున్నారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యతను సంపన్న దేశాలు వర్ధమాన దేశాలపైకి నెట్టేసి తమ బాధ్యత లేదని తప్పించుకోజూస్తే పరిస్థితి ఎలా ఉంటుందో తాజా పరిస్థితులు నిదర్శనం. ఫలానా రుతువులోనే ఎండలు కాయాలి , వర్షాలు పడాలనే ఋతు చక్రం ఇప్పుడు పని చేయడం లేదు. ఈ విషయాన్ని అగ్రదేశాలు ఇప్పటికైనా గ్రహిస్తే ప్రకృతి విపత్తులు పునరావృతం కాకుండా ఉం టాయి. ప్రపంచం ఎలా పోయినా పర్వాలేదనే ధోరణితో వ్యవ హరిస్తే ఇలాంటి ఘోర విపత్తులు పునరావృతమవుతూ ఉంటాయి. చైనాలో కరోనా, అమెరికాలో మంచు తుపా ను, రష్యా- ఉక్రె యిన్‌లలో తెచ్చి పెట్టుకున్న యుద్ధం ఎంతో మంది ప్రాణాలను బలిగొన్నాయి. వీటిలో మానవ కల్పితమైన ప్రమాదాలను నివారించ గలిగితే అదే గొప్ప.

# షా ఎంట్రీ.. ఏపీ బీజేపీలో కొత్త జోష్..!



**హైదరాబాద్:** ఏపీ బీజేపీలో కొత్త జోష్ కనిపిస్తోంది. వైసీపీ నుంచి నాయకులను తీసుకుంటున్నామని.. వైసీపీ నుంచి చాలా మంది సిట్టింగులు తమ పార్టీలోకి రానున్నారని నాయకులు ప్రకటనలు చేస్తున్నారు. ఈ పరిణామాలకు రీజన్.. ఈ నెలలో కేంద్ర మంత్రి బీజేపీ సీనియర్ నాయకుడు అమిత్ షా రాష్ట్రంలో పర్యటించనుండడమే. షా పర్యటన ఇప్పటికేఖరారైంది. కర్నూలులో ఆయన పర్యటిం చనున్నారు. ఈ సందర్భంగా పార్టీ నేతలతో కీలక భేటీలు.. వరుసగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమిత్ షా.. ఏపీ నేతలకు ఎలాంటి సందేశం ఇవ్వనున్నారు? వచ్చే ఎన్నికలకు సంబంధించి ఎలాంటి రోడ్ మ్యాప్ ఇవ్వనున్నారు? అనేది ఆసక్తిగా మారింది. ఏపీలో వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకువస్తామని.. లోకల్ నేతలు చెబుతున్నా.. కేంద్రంలోని బీజేపీ వ్యూహం వేరేగా ఉంది. తమకు అనుకూలంగా ఉన్న జగన్ సర్కారును మరోసారి అధికారంలోకి వచ్చేలా సహకరించడమే ఇప్పుడు బీజేపీ ముందున్న వ్యూహంగా డిల్లీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే.. టీడీపీతో పొత్తు విషయంలో ఇప్పటికీ నాన్చుడు ధోరణిని అవలంభిస్తున్నారని అంటున్నాయి. మరోవైపు.. బీజేపీతో పొత్తులో ఉన్న జనసేన మాత్రం టీడీపీతో కలిసి ముందుకు వెళ్లాలని ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో షా ఇప్పుడు ఏం చెబుతారు? నిజానికి టీడీపీతో కలిసి ముందుకు వెళ్లిన ప్రతిసారీ.. బీజేపీ పుంజుకుంది. అధికారం కూడా పంచుకుంది. అయితే.. ఇప్పుడు వ్యూహం మారింది. టీడీపీ పలచన అయితే.. దాని తాలూకు గ్యాప్ను తాము తీసుకుని.. భర్తీ చేయాలనేది బీజేపీ వ్యూహం. అయితే..ఇ ప్పుడు టీడీపీ పుంజుకుంది. చంద్రబాబు మళ్లీ యాక్టివ్ అయ్యారు. దీంతో వచ్చే ఎన్నికలనే ఎందుకు అనుకూలంగా మార్చుకోకూడదనేది బీజేపీలో ఉన్న కొందరి వాదన. ఈ నేపథ్యంలో అమిత్ షా పర్యటనలో టీడీపీతో పొత్తు వ్యవహారంపై తేల్చేస్తారని తెలుస్తోంది. అదేసమయంలో జనసేనతో ఎలా వ్యవహరించాలి? వైసీపీపై ఎలాంటి దాడి చేయాలి? వంటి కీలక అంశాలపైనా ఆయన దిశానిర్దేశం చేయనున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా సోము వీర్రాజు నాయకత్వంపై రాష్ట్ర బీజేపీ నేతలు పెద్దగా సంతృప్తి వ్యక్తం చేయడం లేదు. పురందేశ్వరి సత్యకుమార్ కన్నా లక్ష్మీనారాయణ విష్ణుకుమార్రాజు సహా ఇతర నాయకులు సైతం వీర్రాజుపై వర్రీగానే ఉన్నారు. ఈ క్రమంలో షా.. ఈ విషయం కూడా తేల్చేస్తారని తెలుస్తోంది. మొత్తంగా ఎలా చూసుకున్నా..షా పర్యటన ఏపీ బీజేపీలో జోష్ నింపుతుందనే ప్రచారం సాగుతుండడం గమనార్హం.

సిరా వెలుగు
తెలుగు దినపత్రిక
శుక్రవారం 06 జనవరి 2023

## మా ఆయన ఒక పార్టీలో..
## నేను మరో పార్టీలో ఉండలేం..
## వైసీపీ నేత సుచరిత సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ :** ఏపీ మాజీ మంత్రి వైసీపీ సీనియర్ నాయకురాలు సీఎంగా జగన్ను చూడాలని కలలు కన్న మహిళా నేత.. వైఎస్ కుటుంబానికి ఎంతో కావాల్సిన మనిషిగా గుర్తింపు పొందిన మేకతోటి సుచరిత.. సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ఏడాది ఏప్రిల్లో జరిగిన మంత్రి వర్గం విస్తరణలో అప్పటి వరకు హోం మంత్రిగా ఉన్న సుచ రితను సీఎం జగన్ పక్కన పెట్టారు. అప్పట్లోనే ఆమె ధిక్కార స్వరం వినిపించారు.పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే.. ఇంతలోనే ఏమైందో తెలియదుకానీ.. సర్దుకున్నా రు. అయినప్పటికీ.. ముభావంగానే ఉన్నారు ఈ క్రమంలోనే కొన్ని రోజుల కిందట గుంటూరు వైసీపీ బాధ్య తల నుంచి తప్పుకొంటున్నట్టు రాజీనామా లేఖను మీడియాకు విడుదల చేశారు. ఇక ఆ తర్వాత సైలెం ట్ అయిపోయిన సుచరిత.. మరోసారి ఇప్పుడు వార్తల్లోకి వచ్చారు. తాజాగా ఆమె గుంటూరు జిల్లా కాకుమా నులో మీడియాతో మాట్లాడారు.

"నేను.. నా భర్త ఇద్దరం వైసీపీలోనే ఉన్నాం. నా మాట నా భర్త దయాసాగర్(ఈయన ఐఆర్ ఎస్ అధికారి. ప్రస్తుతం కేంద్రం డిప్యుటేషన్పై తీసుకుని.. ఢిల్లీలో నియమించింది. దీనికి కూడా జగన్ కారణమనే వాద న కొన్నాళ్లు వినిపించింది) దాట వేయరు. అయితే.. నా భర్త రేపు మరోపార్టీలోకి వెళ్లాలని అంటే.. ఒక భార్య గా ఆయనను అనుసరించకతప్పదు.. నేనొక పార్టీ నా భర్త మరోపార్టీలో మా పిల్లలు ఇంకో పార్టీలో ఉండ లేం కదా"అని నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు.ఈ పరిణామాలను గమనిస్తే.. సుచరిత ఇప్పటికే తన దారి తాను చూసుకుంటున్నారన్న వాదనలకు బలా న్ని చేకూరుస్తోందని అంటున్నారు పరిశీలకులు. వాస్తవానికి సుచరిత.. జనసేన వైపు చూస్తున్నారని.. వచ్చే ఎన్నికల్లో ఈ పార్టీ టీడీపీతో పొత్తు పెట్టుకుంటే..ఆమె జనసేనలోకి వెళ్లి మంత్రి పదవిని పొందాలనే ఆశతో ఉన్నారని అంటున్నారు. ఇక భర్త దయాసాగర్.. సీఎం జగన్కు అనుకూలమే అయినా.. ఉద్యోగిగా ఆయన ఏ పార్టీని సమర్థించే పరిస్థితి లేదు. కానీ ఇప్పుడు ఆయనను బూచిగా చూపించి.. సుచరిత వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## ఉత్తర తెలంగాణలో క్షుద్ర పూజల
## కలకలం.. వణుకుతున్న జనం..



**హైదరాబాద్ :** మంత్రాలకు చింతకాయలు రాలవు.. కానీ మేం రాలిపిస్తాం.. అంటూ కొందరు భయపెడుతున్నారు. క్షుద్రపూజల పేరిట రకరకాల ముగ్గులు పుర్రెలు పెడుతూ నీచంగా ప్రవర్తిస్తున్నారు. ఒక వ్యక్తిని శారీరకంగా దెబ్బ కొట్టలేనప్పుడు అతడిని మానసికంగా కుంగదీసేందుకు చాలా మంది ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలోనే కొందరు క్షుద్రపూజలు చేస్తూ వారిని లొంగదీసుకుంటారు.దేశం సాంకేతికంగా ఎంతో ముందుకు పోతున్నా.. మూఢనమ్మకాలను నమ్మేవారు ఇంకా ఉన్నారు. అలాంటి వారిని భయపెట్టేందుకు కొందరు ఇలాంటి వికృత పనులు చేస్తున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లాలో క్షుద్ర పూజలు చేయడంతో ఆ ప్రాంత వాసులు వణికిపోతున్నారు. ఇక్కడ మాత్రమే కాకుండా ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా ఇదే సంస్కృతి నెలకొనడంతో సమాజం ఎటు పోతుందో అర్థం కావడం లేదని అనుకుంటున్నారు. అయితే జన విజ్ఒన వేదిక నాయకులు మాత్రం ఇలాంటివి నమ్మొద్దని ఇవి కేవలం ఎదుటి వారిని భయపెట్టేందుకే చేస్తారని అంటున్నారు.దేవుళ్లను నమ్మేవారు.. దెయ్యాలను కూడా నమ్మాలని కొందరు ఆధ్యాత్మిక వాదులు చెబుతూ ఉంటారు.

అయితే మానసిక ప్రశాంతత కోసం దేవుళ్లను పూజించేవారు.. అదే సమయంలో దెయ్యాలు ఉన్నాయని ప్రశాంతతను చెడగొట్టుకుంటున్నారు. తాము అనుకున్న కొన్ని పనులు ఎలాంటి కాయ కష్టం లేకుండా సాధించుకోవాలని కొందరు ఆధ్యాత్మిక వాదులను సంప్రదిస్తుంటారు. ఇలాంటి వారిని ఆసరాగా చేసుకొని కొందరు క్షుద్రపూజలు చేస్తే ఫలితాలు ఉంటాయని చెబుతారు. క్షుద్రపూజలు చేసేవారు ఉచితంగా ఎవరూ చేయరన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. అలాంటప్పుడు వారు వ్యాపారం కోసమే ఇలాంటివి సృష్టిస్తారని అనుకోవాలి కదా..అయితే తమను క్షుద్రపూజలు చేయమన్నవారికి అనుగుణంగా నడుచుకోకపోతే ఏం జరుగుతుందోన్న ఆందోళనతోనూ కొందరు వారు చెప్పింది చేస్తారు. ఇలా చాలా మంది లొంగిపోయి.. వారు చెప్పిన విధంగా తమ శత్రువుల ఇళ్ల ముందు.. లేదా ఇతర కార్యక్రమాలు చేస్తుంటారు. ఇలాంటి సంస్కృతి ఇప్పుడు ఉత్తర తెలంగాణలో బాగా పాతుకుపోయింది.

తాజాగా మహబూబాబాద్ జిల్లాలో ఒకరి ఇంటి ముందు ముగ్గు వేసి అందులో మనిషి పుర్రెను ఉంచారు. దీంతో ఆ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఇక్కడే కాకుండా చాలా మంది తమకు శత్రువులుగా ఉన్నవారిని లొంగదీసుకునేందుకు ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారు.ఇలాంటి మూఢనమ్మకాలకు అస్సలు భయపడొద్దని జన విజ్ఒన వేదిక నాయకులు అంటున్నారు. కేవలం భయపెట్టేందుకు ఇలాంటివి చేస్తుంటారని అంటున్నారు.

ప్రతీ పనిని టెక్నాలజీతోనే పనులు చేసుకుంటున్నారని అలాంటప్పుడు క్షుద్రపూజలను నమ్మాల్సిన అవసరం లేదంటున్నారు. కొందరు వీటిని చేస్తామన్న వారిని పోలీసులకు పట్టించాలని అంటున్నారు. అయితే క్షుద్రపూజల వ్యవహారం ఎంతో కాలం నుంచి వస్తోంది. ఒకప్పుడు అనాగరికం వల్ల ఇలాంటి వాటికి భయపడాల్సి వచ్చింది.

## ఢిల్లీ కారుప్రమాదం..
## అంజలి ఫ్రెండ్పైనే అనుమానాలు!

**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన కారు ప్రమాద ఘటన అనేక మలుపులు తిరుగుతోంది. స్కూటీపై వెళ్తున్న అంజలిని మద్యం మత్తులో ఉన్న యువకులు కారుతో ఢీకొట్టి ఈడ్చుకెళ్లిన ఘటన దేశం మొత్తాన్నీ నివ్వెర పోయేలా చేసింది. అయితే ఈ సమయంలో ఆమె స్నేహితురాలు నిధి స్పాట్లోనే ఉన్నట్టు తెలిసింది. అంజలి కారు కింద నలిగిపోవడం చూసి కూడా ఆమె సాయం చేయకుండా.. కనీసం స్పాట్లో ఉండి పోలీసులకు ఫోన్ కూడా చేయకుండా.. అక్కడ నుంచి వెళ్లిపోవడాన్ని నెటిజన్లు తప్పు పడుతున్నారు.


అంతేకాదు.. అంజలిదే తప్పు అని నిధి మాట్లాడడం.. మరింతగా వివాదాన్ని పెంచింది.నిధి తీరుపై ఢిల్లీ మహిళా కమిషన్ ఛైర్మన్ స్వాతి మలివాల్ మండిపడ్డారు. చనిపోయిన ఫ్రెండ్ గురించి ఇలా మాట్లాడటమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

"నీ కళ్ల ముందే అంజలి కారు కింద పడి నలిగిపోతుంటే చూసి పారిపోయావ్.. నువ్వేం ఫ్రెండ్వి" అని ఫైర్ అయ్యారు. విపత్కర పరిస్థితిలో స్నేహితురాలిని విడిచిపెట్టి వెళ్లిన నీ లాంటి వాళ్లను ఎలా నమ్మాలి అని వ్యాఖ్యానించారు.

**అసలు ఏం జరిగింది?**

ఈనెల 1న అంజలి నిధి స్కూటీపై వెళ్తుండగా వీరి వాహనాన్ని కారు ఢీకొట్టింది. కారు చక్రాల కింద అంజలి ఇరుక్కుంది. తాగిన మత్తులో ఉన్న ఐదుగురు యువకులు ఈ విషయాన్ని గమనించకుండా కారును కిలోమీటర్ల మేర తిప్పారు. దీంతో ఆమె దారుణంగా చనిపోయింది. కంఝావాల ప్రాంతంలో ఉదయం అంజలి మృతదేహం నగ్నంగా లభ్యమవ్వడం కలకలం రేపింది.

# తెలంగాణ కాంగ్రెస్
# కూటమిగానా..? ఒంటరిగానా..?



**హైదరాబాద్ :** వచ్చే ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ ఎలా పోటి చేస్తుంది..? కూటమిగానా..? ఒంటరిగానా..? అనేది ఇప్పుడు కీలకంశంగా మారింది. తెలంగాణలో సార్వత్రిక ఎన్నికలకు మరెంతో కాలం లేదు. అటూ ఇటుగా మరో 10 నెలల్లో ప్రభుత్వం మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధికార బీఆర్ఎస్ పార్టీతో పాటు ప్రతిపక్షాలు ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా కాంగ్రెస్ వచ్చే ఎన్నికల్లో ఏ విధంగా ముందుకు వెళ్లాలి..? అనే కార్యాచరణ రూపొందించేందుకు సమాయత్తమవుతోంది. అయితే మిగతా పార్టీలు ఎవరికి వారే అన్నట్లుగా ఉన్నారు. సీపీఎం మినహా ఇతర పార్టీలతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకునే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ చీఫ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడోనని అనుకుంటున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నుంచి కాంగ్రెస్ పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది. గత ఎన్నికల్లోనూ కొన్ని సీట్లు సాధించి పరువు నిలబెట్టుకుంది. అయితే కాంగ్రెస్ పార్టీతో గెలిచిన వారిలో కొందరు బీఆర్ఎస్ లోకి వెళ్లారు. మిగిలిన వారితో పాటు కేడర్ పార్టీ డెవలప్మెంట్ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయితే పార్టీలో ఏర్పడిన అసంతృప్తుల కారణంగా పార్టీ పరిస్థితి ఆందోళనకంగా మారింది. సీనియర్లు జూనియర్లు విడిపోయిన ఎవరికి వారే అన్న విధంగా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. పార్టీ చీఫ్ రేవంత్ రెడ్డిపై అసంతృప్తితో కొందరు ఆయన నిర్వహించే సమావేశాలకు గౌర్హాజరవుతున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎలా పోటీ చేస్తుంది..? అన్న సందేహం పార్టీ శ్రేణుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒంటరిగా కాకుండా ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకునే అవకాశం కనిపించడం లేదు. ఎందుకంటే బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదు.సీపీఐ నాయకులకు ఇప్పటికే బీఆర్ఎస్ గాలం వేసింది. టీడీపీతో గతంలో పొత్తు పెట్టుకుంటే కలిసి రాలేదు. దీంతో మరోసారి ఆ మిస్టేక్ చేయొద్దనే ఒత్తిడి ఉంటుంది. ఇక కొత్తగా వచ్చిన వైఎస్సార్టీపీటీ పార్టీ నేత షర్మిల కూడా కాంగ్రెస్ పై ఆరోపణలు చేస్తున్నారు. పోనీ కొదండరాంను చేరదీస్తారా..? అంటే ఆయనకే ఓట్లు పడుతాయో లేదో..? అనే అనుమానాలున్నాయి.ఈ నేపథ్యంలో ఒక్క సీపీఎంతో మాత్రమే అవకాశం ఉంది. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లోసీపీఎంను కలుపుకొని ప్రజల్లోకి వెళ్తే ప్రజల్లో మార్పు వస్తుందని అనుకోవడం లేదు. అందువల్ల రేవంత్ రెడ్డి ఒక్కోసారి ఒంటరిగానే కాంగ్రెస్ పోటీ చేస్తుందని చెప్పుకుంటున్నారు. ఇప్పుడు తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ బీజేపీల మధ్యే టఫ్ ఫైట్ ఉంటుందని అనుకోవచ్చు. కానీ బీజేపీకి ఆశించినంత సీట్లు వస్తాయని ఎవరూ అనుకోవడం లేదు. ఈ తరుణంలో కాంగ్రెస్ కొన్ని ప్రాంతాలపై ప్రభావం చూపొచ్చు.అయితే ఒంటరిగా ఎన్నికల్లోకి వెళ్తేనే అంతో ఇంతో పార్టీని ఆదరిస్తారని అంటున్నారు. మరో పార్టీతో కలిసి వెళ్తే ఉన్న స్టాటజీ కూడా తగ్గుతుందని అంటున్నారు. అయితే పార్టీలో ఉన్న అసంతృప్తిని చల్లార్చుడానికే రేవంత్ రెడ్డి ప్రయత్నాలు ఫలించడం లేదు. మరి ఒంటరిగా ఎన్నికల్లో వెళ్లి ఎలాంటి ప్రభావం చూపుతారోనని చర్చించుకుంటున్నారు. మరో 10 నెలల్లో పరిస్థితులు కాంగ్రెస్ కు అనుకూలంగా మారితే తప్ప పార్టీకి గడ్డుకాలం ఏర్పడే ప్రమాదం ఉంది.

## కేసీఆర్పై విష్ణుకుమార్ రాజు సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ :** బీఆర్ ఎస్ అధినేత తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్పై బీజేపీ సీనియర్ నాయకుడు ఏపీ నేత విష్ణుకుమా ర్ రాజు సంచలన వ్యాఖ్యలు చేశారు. కాపులను పనిగట్టుకుని జనసేన అధినేత పవన్కు దూరం చేసేందు కు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని అన్నారు. దీనిలో సీఎం జగన్ పాత్ర కూడా ఉందని.. ఇద్దరూ కలిసి పవన్ ను రాజకీయంగా బద్నాం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు.ఏపీలో కాపులను విడదీసేందుకే.. కేసీఆర్.. తోట చంద్రశేఖర్కు ఏపీలో బీఆర్ ఎస్ పగ్గాలు అప్పగించారని విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యానించారు. అయితే.. ఇది సాగదని అన్నారు.అసలు ఏపీకి శత్రువు అంటూ.. ఎవరై నా ఉంటే అది కేసీఆరేనని వ్యాఖ్యానించారు.

ఉమ్మడి రాష్ట్రాన్ని విడదీసింది ఆయనేనని చెప్పారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీ ప్రజలను ఏవిధంగా తిట్టి పోశారో ఎవరూ మరిచిపోలేదని కూడా వ్యాఖ్యానించారు.ఏపీలో జగన్తో కలిసి..కేసీఆర్ కాపులపై కుట్రలు పన్నుతున్నారని విష్ణు వ్యాఖ్యానించారు. పవన్ను కంట్రోల్ చేయడం జగన్ వల్లే కాదు కేసీఆర్ వల్ల ఇంకేమవుతుందని ఆయన అన్నారు. కేసీఆర్ కారణంగానే ఆంధ్రప్రదేశ్కు ఇలాంటి దుస్థితి వచ్చిందని.. ఆయన తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా ఏపీపై విద్వేషం కక్కారని రాజు ఆరోపించారు.బీజేపీ-పవన్ కళ్యాణ్-టీడీపీ కలిసి పోటీ చేస్తారని.. వస్తున్న వార్తల నేపథ్యంలో ఈ అనుకూల వాతావరణా న్ని చెడగొట్టేందుకు కేసీఆర్ ప్రయత్నాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు.జాతీయ పార్టీగా ఎదగాలని భావిస్తున్న బీఆర్ఎస్ ఏపీలో మాత్రం జగన్ పార్టీతో కలిసి కుమ్మక్కు రాజకీయాలు చేస్తూ పవన్ అవకాశాలు పోగొట్టే ప్రయత్నాలు చేస్తోందన్నది విష్ణు ఆరోపణల ప్రధాన ఉద్దేశం. మరి దీనిపై తెలంగాణలో ఎలాంటి రియాక్షన్ వస్తుందో చూడాలి.

# వైఎస్ రాజశేఖర్ రెడ్డి
# ప్రాధాన్యత రేవంత్ రెడ్డికి వస్తుందా..?



**హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ పరిస్థితి రోజు రోజుకు ఆందోళనకరంగా మారుతోంది. ఆ పార్టీని ఇతర పార్టీలు ప్రభావం చేయకముందే సొంత కుంపటిలో చల్లారని అసంతృప్తి నెలకొంది. సీనియర్లు జూనియర్లు విడిపోయిన తరువాత ఎవరి దారి వారిదే అన్నట్లు గా ప్రవర్తిస్తున్నారు. వీరందరిని ఒక్కటి చేయాల్సిన అధిష్టానం కూడా పట్టించుకోకపోవడంతో వచ్చే ఎన్నికల నాటికి ఎటువంటి పరిస్థితుల్లో ఉంటుందోనని కేడర్ ఆందోళన చెందుతోంది. అయితే రేవంత్ కామెంట్స్ ఇటీవల మార్పులు చోటు చేసుకున్నాయి. ఆయన ఎక్కువగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి గురించి మాట్లాడుతున్నారు. అంటే అసంతృప్తి చల్లార్చడానికి ఆయన వైఎస్ ను వాడుతున్నారా..? అనేది చర్చనీయాంశంగా మారింది.ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తరువాత కాంగ్రెస్ విచ్చుకుపోతోంది. 2014లో కాంగ్రెస్ పై ఉన్న అభిమానంతో ఆ పార్టీకి ఓట్లు బాగానే వచ్చాయి. ఈ నేపథ్యంలో కొందరు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. అయితే వీరిలో చాలా మంది అధికార టీఆర్ఎస్ మాయలో పాడి కాంగ్రెస్ జెండాను పక్కనబెట్టారు. ఇప్పుడు గులాబీ కండువా కప్పుకొని మంత్రి పదవులు అనుభవిస్తున్నారు. కాంగ్రెస్ పేరు చెప్పుకొని గెలిచినవారు తమ పదవులకు రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డి అప్పుడప్పుడు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు వారు రేవంత్ వ్యాఖ్యలను సీరియస్ గా తీసుకునే అవకాశం లేదు.మరోవైపు ఇటీవల కాంగ్రెస్ లో వివాదాలు ముదిరాయి. సీనియర్లు జూనియర్లు విడిపోయారు.

వీరిని చక్కదిద్దేందుకు అధిష్టానం దిగ్విజయ్ సింగ్ ను పంపించినా సమస్య పరిష్కారం కాలేదు. త్వరలో ప్రియాంకా గాంధీ వస్తుందని అంటున్నారు.కానీ ప్రస్తుతానికైతే పార్టీకి సంబంధించి ఏ కార్యక్రమం నిర్వహించిన అందరూ హాజరు కావడం లేదన్నది కనిపిస్తోంది. ఈ తరుణంలో రేవంత్ రెడ్డి తన వ్యూహం మార్చారు. 2004లో ఒంటి చేత్తో అధికారాన్ని తీసుకొచ్చిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరును రేవంత్ రెడ్డి పదే పదే తీస్తున్నారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి తెలంగాణకు ఎంతో చేశారని ఆయన ఆశయాలు కొనసాగించేందుకు కాంగ్రెస్ ను కాపాడాలని అంటున్నారు. వాస్తవానికి తెలంగాణలో చాలా చోట్ల వైఎస్ అభిమానులు ఉన్నారు. ఆ నేపథ్యంలోనే రాజశేఖర్ రెడ్డి కూతురు షర్మిల ఉత్తర తెలంగాణలో 3 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేయగలిగింది. కొన్ని కారణాల వల్ల ఆ పాదయాత్ర ఆగిపోయింది. అయితే ఇప్పుడు రేవంత్ రెడ్డి వైఎస్ పేరును వాడుకుంటూ పార్టీని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు.వైఎస్ హయాంలో కాంగ్రెస్ లో ఎలాంటి అసంతృప్తి రానివ్వలేదు. ప్రభుత్వంపై కూడా వ్యతిరేకత రాకుండా చూసుకున్నారు. అయితే ఆయన ప్రవేశపెట్టిన కొన్ని పథకాలపై ఇప్పటికీ చాలా మంది లబ్ధి పొందుతున్నారు. అందువల్ల ఆయన ఆశయాలు కొనసాగించాలంటే కాంగ్రెస్ ను ఆదరించాలని అంటున్నారు.

ఇదే సమయంలో వైఎస్ రాజన్న రాజ్యం తీసుకొస్తానని వ్యాఖ్యలు చేయడం పార్టీ కేడర్లోనూ చర్చనీయాంశంగా మారింది. కానీ సీనియర్లు రేవంత్ రెడ్డి వ్యూహంతో మారుతారా..? అనేది తెలియాల్సిన అంశం. కునారిల్లుతున్న తెలంగాణ కాంగ్రెస్ ను జాకీలు వేసి లేపడానికి టీపీసీసీ చీఫ్ గా బాధ్యతలు చేపట్టారు రేవంత్ రెడ్డి.అయితే రేవంత్ లో ఉత్సాహం ఎంత ఉన్నా అడ్డుకునేందుకు కాంగ్రెస్ సీనియర్లు ముందుంటున్నారు.అసమ్మతి రాజేస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్ పరిస్థితి రోజు రోజుకు ఆందోళనకరంగా మారుతోంది. ఆ పార్టీని ఇతర పార్టీలు ప్రభావం చేయకముందే సొంత కుంపటిలో చల్లారని అసంతృప్తి నెలకొంది. సీనియర్లు జూనియర్లు విడిపోయిన తరువాత ఎవరి దారి వారిదే అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు. వీరందరిని ఒక్కటి చేయాల్సిన అధిష్టానం కూడా పట్టించుకోకపోవడంతో వచ్చే ఎన్నికల నాటికి ఎటువంటి పరిస్థితుల్లో ఉంటుందోనని కేడర్ ఆందోళన చెందుతోంది.ఇటీవల కాంగ్రెస్ లో వివాదాలు ముదిరాయి. సీనియర్లు జూనియర్లు విడిపోయారు. వీరిని చక్కదిద్దేందుకు అధిష్టానం దిగ్విజయ్ సింగ్ ను పంపించినా సమస్య పరిష్కారం కాలేదు. త్వరలో ప్రియాంకా గాంధీ వస్తుందని అంటున్నారు.

కానీ ప్రస్తుతానికైతే పార్టీకి సంబంధించి ఏ కార్యక్రమం నిర్వహించిన అందరూ హాజరు కావడం లేదన్నది కనిపిస్తోంది. ఇప్పుడు సీనియర్ల వ్యాఖ్యలతో రేవంత్ రెడ్డి బాగా హర్ట్ అయ్యారు. అందుకే బరెస్ట్ అయ్యారు. పార్టీలో తన పదవిని త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నానని రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చేలా సహకరిస్తే ప్రాణాలర్పించేందుకు వెనుకాడబోనని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. బుధవారం ఇక్కడ జరిగిన పార్టీ క్యాడర్కు జరిగిన ఒకరోజు శిక్షణా శిబిరంలో ఆయన కీలకోపన్యాసం చేస్తూ తెలంగాణ కాంగ్రెస్లో ఎలాంటి విభేదాలు లేవని ఉద్ఘాటిస్తూనే.. తెలంగాణ కాంగ్రెస్లో ఎలాంటి విభేదాలు లేవని.. తనకు ప్రయోజనం చేకూర్చే పక్షంలో ఎవరికైనా తన పదవిని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

"నేను పదవిని త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నాను. రాహుల్ గాంధీ దేశవ్యాప్త పాదయాత్రతో పోలిస్తే ఇది ఏమీ కాదు. ఐక్యంగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు. వారికి డబ్బు మద్యం అక్కర్లేదు కానీ మనం గెలవాలని కోరుకుంటున్నాం" అని అన్నారు.

కె. చంద్రశేఖర్రావుకు ప్రజలు రెండుసార్లు ఆదేశం ఇచ్చినా ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చడంలో విఫలమయ్యారని రేవంత్ అన్నారు. "కేసీఆర్ చేతిలో మోసపోలేదని భావించే వారు రాష్ట్రంలో ఎవరూ లేరు. ప్రజల నుండి భూమిని లాక్కునే హక్కు మీకు ఎవరు ఇచ్చారు? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అంతకుముందు రోజు ధరణి పోర్టల్ను అమలు చేసిన తర్వాత లక్షల మంది నష్టపోయారని రేవంత్ ఆరోపించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు 19.88% వృద్ధిని సాధించాయని రావు ప్రభుత్వం 12.55% సాధించిందని ఆయన అన్నారు.ప్రస్తుతం రేవంత్ ను బలపరిచిన మాణిక్యం ఠాగూర్ ను ఎలాగోలా లేపేశారు కాంగ్రెస్ సీనియర్లు. ఇప్పుడు తమ ఒత్తిడికి తలొగ్గిన అధిష్టానానికి రేవంత్ ను కూడా లేపాలని చూస్తున్నారు. అందుకే రేవంత్ కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తాను పదవిని కోల్పోవడానికి కూడా సిద్ధం అంటూ వైరాగ్యపు మాటలు మాట్లాడారు. సో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నుంచి తప్పుకుంటారా? కాంగ్రెస్ ను వీడుతారా? అన్న చర్చ మొదలైంది.

# భారత్ పైకి హనీట్రాప్.. సంవత్సరానికి 3500 కోట్ల బడ్జెట్ పెట్టిన పాకిస్తాన్!



**ఢిల్లీ:** హనీ-ట్రాపింగ్ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఈసారి పాకిస్తాన్ మాజీ సైనికుల సంఘం మాజీ సైనిక ప్రతినిధి రిటైర్డ్ ఆర్మీ మేజర్ ఆదిల్ రాజా దీన్ని బయటపెట్టాడు. ప్రముఖ సినీ నటులను ఇతర రాజకీయ నాయకులను హనీ-ట్రాప్ చేయడానికి పాకిస్తాన్ సైన్యం 'హనీ ట్రాప్'ను ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు.పాకిస్థాన్ను తాకిన తాజా వివాదం పెనుసంచలనంగా మారింది. ఈ ఆరోపణలను ముగ్గురు అగ్ర నటులు సజల్ అలీ కోబ్రా ఖాన్ మరియు మెహ్విష్ హయత్ ఖండించారు. 2017లో వచ్చిన 'మామ్' సినిమాలో శ్రీదేవితో కలిసి నటించిన అలీ దేశం నైతికంగా దిగజారడం నీచంగా మారడం బాధాకరమని అన్నారు.నటీనటులు ఆరోపణలను నిరాధారమైనవని కొట్టిపారేసినప్పటికీ.. పాకిస్తాన్ ఇలా భారత సైనికులపై ప్రముఖులపై పాకిస్తాన్ లోని ప్రముఖులపై చాలా హనీ ట్రాపింగ్లో పాల్గొంటుందనేది వాస్తవం. ఇది అనేక సందర్భాల్లో భారత్కు వ్యతిరేకంగా ఉపయోగించింది. హనీ ట్రాప్ చేయడానికి పాకిస్థాన్ ఆర్మీకి ప్రత్యేక విభాగం ఉంది. కొంతమంది జవాన్లు సున్నితమైన సంస్థలలో పని చేసేవారు. 2019 సంవత్సరంలో మిలిటరీ నర్సింగ్ కార్ప్స్లో ఆర్మీ కెప్టెన్గా నటించిన అనికా చోప్రా అనే మహిళ తన రాడార్ కింద దాదాపు 50 మంది భారతీయ జవాన్లను హానీ ట్రాప్ చేసిందని తేలింది. ఆ మహిళ పాకిస్థానీ అని తర్వాత తెలిసింది. హనీ ట్రాపింగ్ అనేది చాలా గూఢచారి ఏజెన్సీల పాత ట్రిక్ అయితే భారతదేశానికి ఆందోళన కలిగించేది ఏంటంటే ఈ హనీ ట్రాప్ భారత సైన్యం రహస్యాలు తెలుసుకునేందుకు పాకిస్తాన్ ఆడుతున్న గేమ్ కావడం గమనార్హం. 2019 వరకు పాకిస్తాన్లో ఇలా హనీ ట్రాపింగ్ చేయడానికి సంవత్సరానికి బడ్జెట్ను రూ. 3500 కోట్లు కేటాయించారంటే వారు ఎంతలా భారత్ ను దెబ్బతీయడానికి దీన్ని ఉపయోగిస్తున్నారన్నది అర్థం చేసుకోవచ్చు. ఐఎస్ఐ మరియు పాకిస్తాన్లచే నియంత్రించబడే హనీ ట్రాప్ మాడ్యూల్ ఫరీద్కోట్ నుంచి నడుస్తోంది. సంవత్సరానికి రూ. 3500 కోట్ల బడ్జెట్ ను పాకిస్తాన్ కేటాయించి మరీ భారత్ సైన్యంపై ప్రయోగిస్తోంది. 2015 నుంచి ఈ హానీ ట్రాప్ కోసం బడ్జెట్ కేటాయింపులు చేస్తోందని తేలింది. ఇందులో ఐఎస్ఐ కీలక పాత్ర పోషిస్తోంది.గుజరాత్ రాజస్థాన్ మధ్యప్రదేశ్ మరియు ఉత్తరప్రదేశ్లలో ఐఎస్ఐ అటువంటి హానీ ట్రాప్ లను కూడా చిన్న స్థాయిలో ఏర్పాటు చేయగలిగిందని.. ఇవి పాకిస్తాన్లోని ఫరీద్కోట్లోని తమ ఉన్నతాధికారులకు ఉచ్చు ఎలా వేశారో నివేదిస్తాయని ఒక అధికారి బయటపెట్టారు.ఈ ఉచ్చు తర్వాత పాకిస్తాన్ నుండి వచ్చిన మహిళ నగదు ఎర ద్వారా లేదా బ్లాక్ మెయిల్ ద్వారా సమాచారాన్ని రాబట్టింది. చిక్కుకున్న వ్యక్తికి అందుతున్న సమాచారాన్ని బట్టి రూ.5 నుంచి 10 లక్షల వరకు చెల్లిస్తారు. 2019 లో రోహ్తక్ పోలీసులు గౌరవ్ కుమార్ను అరెస్టు చేశారు దీని తరువాత అతను ఆర్మీ శిక్షణా శిబిరాన్ని సందర్శించిన ప్రతిసారీ చిత్రాలను క్లిక్ చేయమని తనను వేధించారని తెలిపాడు. ఆ సమయంలో కుమార్ ఆర్మీలో చేరేందుకు శిక్షణ పొందుతున్నాడు. అతను శిక్షణా శిబిరాన్ని 18 సార్లు సందర్శించినట్లు కనుగొనబడింది. ఆ సమయంలో అతను చిత్రాలను క్లిక్ చేసి సమాచారాన్ని పాకిస్తాన్ కు చెందిన హానీట్రాప్ చేసిన మహిళతో పంచుకున్నాడు. ఇలా భారత్ ను దెబ్బతీయడానికి పాకిస్తాన్ వేల కోట్లు హనీట్రాప్ కోసం ఖర్చు చేస్తోందని తాజాగా ఆ దేశ రిటైర్డ్ ఆర్మీ మేజర్ ఆదిల్ రాజా బయటపెట్టడం సంచలనమైంది.

# జైనుల ఆందోళనకు తలొగ్గిన కేంద్రం.. పర్యావరణ-పర్యాటక పనులు నిషేధించాలని ఆదేశం





**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా జైనులు చేస్తున్న ఆందోళనకు కేంద్ర ప్రభుత్వం తలొగ్గింది. జైనుల పుణ్యక్షేత్రం సమ్మేద్ శిఖర్ను పర్యాటక ప్రదేశం జాబితా నుంచి తొలగించింది. జైన్ కమ్యూనిటీ నుంచి వచ్చిన డిమాండ్కు అంగీకరించిన కేంద్రం.. ఈ మేరకు పర్యావరణ పర్యాటక పనులను నిషేధించాలని జార?ండ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. సమ్మేద్ శిఖర్ను పర్యాటక ప్రాంతం జాబితా నుంచి తొలగించడం పట్ల జైనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జైన్ కమ్యూనిటీ పెద్దలతో కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ భేటీ అయిన అనంతరం ఈ ఆదేశాలు జారీ అయ్యాయి.జార?ండ్లోని పరస్నాథ్లోని ఎత్తైన పర్వతంపై ఉన్న జైన పుణ్యక్షేత్రమే సమ్మేద్ శిఖర్. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతం జాబితా నుంచి తొలగించారు. మూడేండ్ల క్రితం జారీ చేసిన ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం గురువారం ఉపసంహరించుకున్నది. ఇక్కడ అన్ని టూరిజం, ఎకో టోరిజం కార్యకలాపాలను నిషేధించాలని సూచిస్తూ కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ తన నోటిఫికేషన్లో పేర్కొన్నది. సమ్మేద్ శిఖర్ను పర్యావరణ సున్నిత ప్రాంతంగా 2019 లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

ఆ తర్వాత జార?ండ్ ప్రభుత్వం జిల్లా యంత్రాంగం సిఫార్సు మేరకు దీనిని పర్యాటక కేంద్రంగా ప్రకటిస్తూ తీర్మానం లేఖను జారీ చేసింది. గిరిదిహ్ జిల్లా యంత్రాంగం ఇక్కడ పౌర సౌకర్యాలను అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ను కూడా సిద్ధం చేసింది

.గురువారం మధ్యాహ్నం పలువురు జైన మతపెద్దలు కేంద్ర మంత్రి భూపేంద్రయాదవ్తో భేటీ అయ్యారు. తమకు చెందిన పుణ్యక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా మార్చడంపై వారు తమ నిరసన వ్యక్తం చేశారు. దాంతో కేంద్రం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేందుకు అంగీకరించింది.

సమ్మేద్ శిఖర్తో సహా జైన సమాజంలోని అన్ని మతపరమైన ప్రదేశాలలో జైనుల హక్కులను పరిరక్షించడం, సంరక్షించడంలో కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ జైన సమాజానికి హామీ ఇచ్చారు.

# రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో త్రిముఖపోటీ.. 40 స్థానాల్లో పోటీకి సిద్ధమైన ఆప్




ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్).. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో మంచి పోటీనిచ్చింది. గణనీయమైన సంఖ్యలో ఓట్లను రాబట్టుకుని ఊపుమీదున్న ఆప్.. త్వరలో జరగనున్న రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో తలపడేందుకు సిద్ధమవుతున్నది. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేసేందుకు ఆప్ జాతీయ కార్యదర్శి సందీప్ పాఠక్కు ఇంఛార్జీ బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి బీజేపీ నుంచి గట్టి పోటీ ఉన్నది. ఆప్ కూడా ఇక్కడి ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకోవడంతో త్రిముఖ పోటీ అనివార్యం కానున్నది.గుజరాత్లో మంచి ఓట్లను సాధించి జాతీయ పార్టీగా గుర్తింపు సాధించిన ఆప్.. ఇప్పుడు రాజస్థాన్పై కన్నేసింది. రాజస్థాన్ పెద్ద రాష్ట్రమైనందున ఇక్కడ పరిమిత స్థానాల్లో పోటీ చేయాలని సీనియర్ నాయకులు అధిష్టానానికి సూచిస్తున్నారు. ముఖ్యంగా ఢిల్లీ, పంజాబ్, హర్యానా రాష్ట్రాలను ఆనుకుని ఉన్న అసెంబ్లీ సెగ్మెంట్లలో పోటీ చేయడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చునని వారు చెప్తున్నారు. దాంతో రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో 30-40 స్థానాల్లో పోటీ చేయాలని ఆప్ దాదాపు నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తున్నది.గత ఏడాది మార్చి నుంచి రాజస్థాన్లో ఆప్ తన ఎన్నికల కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ 10 నెలల్లో రాజస్థాన్లో ఆప్ ఎదుగుదల గురించి నాయకులు, కార్యకర్తల నుంచి ఫీడ్బ్యాక్ తీసుకున్నారు. ఇదే సమయంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే సాధ్యాసాధ్యాలపై ఆ పార్టీ నేతలు మేధోమథనం చేపట్టారు. కార్యకర్తల నుంచి అభిప్రాయం తీసుకున్న అనంతరం ఎన్నికల విధానాన్ని నిర్ణయిస్తామని ఆప్ సీనియర్ నేత వినయ్ మిశ్రా తెలిపారు.

# నా కుమార్తెపై అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారు: నిధి తల్లి




న్యూఢిల్లీ: అంజలి సింగ్ మృతి కేసులో తన కుమార్తెపై అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని నిధి తల్లి ఆరోపించింది. స్నేహితురాలైన నిధిపై అంజలి తల్లి చేసిన ఆరోపణలను ఆమె ఖండించింది. అంజలి తల్లి రేఖా తన కుమార్తె నిధిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని గురువారం మీడియాతో అన్నది. 'ఆమె (నిధి) భయాందోళన చెందింది. కొందరు వ్యక్తులు తన స్నేహితురాలిని కారుతో ఢీకొట్టి ఈడ్చుకెళ్లినట్లు నాతో చెప్పింది. తనను కూడా అదేవిధంగా చేసేందుకు వారు ప్రయత్నించడంతో భయపడి పారిపోయినట్లు నిధి తెలిపింది' అని మీడియాకు వెల్లడించింది.

%కాగా, ఢిల్లీలోని సుల్తాన్పురిలో న్యూఇయర్ తెల్లవారుజామున అంజలి సింగ్ అనే 20 ఏళ్ల యువతి నడుపుతున్న స్కూటీని ఐదుగురు ప్రయాణించిన కారు ఢీకొట్టింది. కారు టైరు ముందు భాగంలో ఆమె కాళ్లు ఇరుక్కోవడంతో కొన్ని కిలోమీటర్లు ఈడ్చుకెళ్లగా ఆమె చనిపోయింది. అంజలితోపాటు స్కూటీపై ప్రయాణించిన నిధి ఈ ప్రమాదం తర్వాత పట్టించుకోకుండా సంఘటనా స్థలం నుంచి తన ఇంటికి వెళ్లిపోయింది.మరోవైపు స్కూటీపై నిధి కూడా ఉన్నట్లు దర్యాప్తులో తెలుసుకున్న పోలీసులు ఆమెను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో నిధి మీడియాతో మాట్లాడింది. మద్యం సేవించిన అంజలి స్కూటీ నడుపుతానని తనతో గొడవపడినట్లు చెప్పింది. మద్యం మత్తులో స్కూటీని స్పీడ్గా డ్రైవ్ చేసి కారును ఢీకొట్టినట్లు ఆరోపించింది. కారు కింద అంజలి చిక్కుకున్న విషయం తెలిసినప్పటికీ అందులోని వ్యక్తులు ఈడ్చుకెళ్లారని నిధి తెలిపింది.అయితే అంజలి మద్యం సేవించలేదని పోస్ట్మార్టం రిపోర్ట్లో తెలిసింది. దీంతో నిధి వ్యాఖ్యలను అంజలి తల్లి ఖండించింది. కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించింది. ఈ నేపథ్యంలో అంజలి స్నేహితురాలైన నిధిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఎ కొత్త సంవత్సరం రోజున దేశరాజధాని ఢిల్లీ శివారు కాంజావాల్ ప్రాంతంలో 20 ఏండ్ల యువతిని కారు సుమారు 12 కిలోమీరట్ల మేర ఈడ్చుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ దారుణ ఘటనలో అంజలి అనే యువతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనలో.. అంజలి మద్యం సేవించి ఉందని, ఆమె స్పృహలో లేదని ప్రమాద సమయంలో మృతురాలితోపాటు ఉన్న ఆమె స్నేహితురాలు నిధి చెప్పింది.

కాగా, నిధి ఆరోపణలను అంజలి కుటుంబం తీవ్రంగా ఖండించింది. నిధి అబద్ధం చెబుతోందని, తన కుమార్తె మరణం కుట్రలో నిధి భాగమని ఆరోపించింది. 'నా కూతురు ఎప్పుడూ మద్యం సేవించలేదు. ఆమె ఎప్పుడూ తాగి ఇంటికి రాలేదు. నిధి అబద్ధం చెబుతోంది. నేను నిధిని ఎప్పుడూ చూడలేదు. ఆమె పేరు కూడా వినలేదు. ఆమె ఎప్పుడూ మా ఇంటికి కూడా రాలేదు. ఆమె నా కూతురి స్నేహితురాలైతే, ప్రమాద సమయంలో అంజలిని వదిలేసి ఎలా పారిపోతుంది? ఇది పథకం ప్రకారం చేసిన కుట్ర. ఇందులో నిధి పాత్ర కూడా ఉండొచ్చు. దీనిపై సమగ్ర విచారణ జరపాలి' అని రేఖాదేవి డిమాండ్ చేశారు.కాగా, శవపరీక్ష నివేదికలో అంజలిపై అత్యాచారం జరగలేదని, ప్రమాదం జరిగిన రాత్రి ఆమె మద్యం సేవించిన ఆనవాళ్లు కనిపించలేదని వెల్లడైంది. అయితే, అంజలి శరీరంపై 40కి పైగా గాయాలు ఉన్నట్లు పోస్టుమార్టం రిపోర్ట్లో తేలింది. యువతి శరీరం వెనుక భాగం ఛిద్రమైందని, దీంతో పక్కటెముకలు బయటకు వచ్చినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. తలభాగం తీవ్రంగా దెబ్బతిందని పేర్కొన్నాయి. వెన్నెముక, కాళ్లకు గాయాలయ్యాయి. ప్రమాదంతో షాక్కు గురవడం, తీవ్ర రక్తస్రావం వల్లే అంజలి మృతి చెందిందని పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది.

# సౌత్ ఇండియన్ టిఫిన్గా బిర్యానీ.. ఛాట్ జీపీటీ తీరుపై సత్య నాదెళ్ల అభ్యంతరం!





బిర్యానీ.. భారత్లో కేవలం పాపులర్ వంటకం మాత్రమే కాదు.. భారతీయులు.. ప్రత్యేకించి హైదరాబాదీలకు భావోద్వేగాలతో కూడుకున్న అంశం. కొద్ది మంది దీన్ని తినకపోవచ్చు. కానీ చాలా మంది ప్రతి రోజూ బిర్యానీ తింటారు.

టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ చైర్మన్ సీఈవో సత్య నాదెళ్ల సైతం బిర్యానీని అంతగా ప్రేమిస్తారు. ఇటీవలే పాపులరైన ఛాట్ జీపీటీ-చాట్ రోబోట్తో సత్య నాదెళ్ల బుధవారం నిర్వహించిన చర్చాగోష్ఠిలో బిర్యానీని టిఫిన్గా చూపెట్టడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

బెంగళూరులో బుధవారం ఫ్యూచర్ రెడీ టెక్నాలజీ సమ్మిట్లో మాట్లాడుతూ సత్యనాదెళ్ల.. ఛాట్ జీపీటీతో చాటింగ్ నిర్వహించారు. పాపులర్ దక్షిణ భారత అల్పాహారాల జాబితా ఇవ్వమని కోరితే.. ఇడ్లీ వడ, దోశలతోపాటు బిర్యానీని సౌత్ ఇండియన్ టిఫిన్స్ జాబితాలో చూపెట్టింది ఛాట్ జీపీటీ. ఈ జాబితాతో తాను అంగీకరించబోనని సత్యనాదెళ్ల చెప్పారు.బిర్యానీని సౌత్ ఇండియన్ టిఫిన్గా పేర్కొంటూ సాఫ్ట్వేర్.. తన ఇంటెలిజెన్స్ను అవమానించొద్దని పేర్కొన్నారు. దీంతో స్పందించిన ఛాట్ జీపీటీ వెంటనే క్షమాపణ చెప్పింది.

# వీధి కుక్కలను కాల్చి చంపుతున్న షూటర్లు.. ఎక్కడంటే?



పాట్నా: జనాలను కరిచి ప్రాణాలు తీస్తున్న వీధి కుక్కలను గన్తో కాల్చి చంపుతున్నారు. ఇప్పటికే 35కు పైగా కుక్కలను హతమార్చారు. బీహార్లోని బెగుసరాయ్ జిల్లాలో అధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టారు. బచ్వారా బ్లాక్ పరిధిలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. మహిళలు, పిల్లలపై దాడి చేసి కరుస్తున్నాయి.

జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఒక మహిళ చనిపోయింది. సోమవారం పొలంలో పని చేస్తున్న ముగ్గురు మహిళలను కుక్కలు కరిచాయి. వారంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నెలలో ఇప్పటికే కుక్కలు కరువడంతో తొమ్మిది మంది మహిళలు మరణించారు. చాలా మంది గాయపడ్డారు.

డిసెంబర్ నెలలో నలుగురు చనిపోయారు.కాగా, ఈ ప్రాంతంలోని వీధి కుక్కలు బయట పడేసే మాంస వ్యర్థాలు తిని పిచ్చిగా ప్రవర్తిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. మనుషులపై దాడి చేసి తినేందుకు కుక్కలు ప్రయత్నిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో క్రూరంగా ప్రవర్తిస్తున్న పిచ్చి కుక్కలను చంపేందుకు షూటర్లను ప్రభుత్వం రంగంలోకి దించింది. దీంతో మంగళవారం 15, బుధవారం 9 కుక్కలను షూటర్లు చంపారు. గత వారం 12 వీధి కుక్కలను హతమార్చారు.

## అమెరికాకు క్యూ కడుతున్న భారతీయ విద్యార్థులు..!




**అమెరికా :** కరోనా మహ్మమారి ఎంట్రీతో అన్ని దేశాలు లాక్ డౌన్ పాటించాయి. ఈ నేపథ్యంలోనే గత రెండేళ్లుగా విద్యా వ్యవస్థ కుంటుపడింది. ఇక విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని అనుకున్న భారతీయులు ఆశలపై కరోనా నీళ్లు చల్లింది. కాగా గతేడాది కాలంగా కరోనా కేసులు తగ్గుముఖం పట్టడం.. వ్యాక్సినేషన్ కారణంగా విదేశాల్లో పరిస్థితులు మళ్లీ మామూలుగా మారాయి. దీంతో విదేశాలకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించేందుకు భారతీయులు తహతహలాడుతున్నారు. ఉక్రెయిన్-రష్యా వార్ నేపథ్యంలోనే భారతీయులు సురక్షిత ప్రాంతాల్లో చదువును కొనసాగించేందుకు ఇష్టపడుతున్నారు.

ఈ నేపథ్యంలోనే అమెరికా.. కెనడా.. బ్రిటన్.. ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వారంతా ఆసక్తి కనబరుస్తున్నారు. గత కొన్నేళ్లతో పోలిస్తే 2022లోనే అమెరికా భారతీయ విద్యార్థులకు అత్యధికంగా వీసాలు మంజూరు చేసినట్లు తాజాగా వెల్లడించారు. 2016 తర్వాత ఒక ఏడాదిలో భారతీయ విద్యార్థులకు 1.25లక్షలు జారీ చేయడం 2022 సంవత్సరంలోనే జరిగిందని అమెరికా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి నెడ్ ప్రైస్ తెలిపారు. అమెరికా వెళ్లే అంతర్జాతీయ విద్యార్థుల్లో భారతీయుల వాటా 20 శాతంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు గత కొన్ని నెలలుగా భారత్ సహా పలు దేశాలకు సంబంధించిన వీసాల మంజూరు పెండింగ్ లో పడిందన్నారు.

ఈ నేపథ్యంలో పెండింగ్ వీసాలను పరిష్కరించడంతో పాటు ఇంటర్వ్యూ వెయిటింగ్ సమయాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు నెడ్ ఫ్రైస్ వివరించారు. వీసాల జారీ కోసం కొత్త ఉద్యోగులను సైతం నియమించినట్లు తెలిపారు. దీంతో పెండింగ్ వీసా మంజూరు ప్రక్రియ త్వరితంగా జరుగుతుందన్నారు. ఈ ఏడాదిలోగా కోవిడ్ ముందు నాటి స్థితికి వీసాల ప్రక్రియ చేరుకుంటుందని తెలిపారు. ప్రస్తుతం అన్ని దేశాలు కరోనా ఆంక్షలు ఎత్తివేయడంతో అమెరికా వీసాలకు మళ్లీ ఫుల్ డిమాండ్ పెరిగిందని ఆయన వెల్లడించారు.

## హెచ్-1బీ ఇతర వీసాల ఫీజులు భారీగా పెంపునకు అమెరికా నిర్ణయం




**అమెరికా :** అమెరికా ప్రభుత్వం ఇమ్మిగ్రేషన్ నేచురలైజేషన్ ప్రయోజనాల కోసం రుసుములను బాగా పెంచాలని ప్రతిపాదించింది. ఈ పరిణామం ప్రత్యేక వృత్తినిపుణులకు భారీ దెబ్బపడనుంది. ఆర్థికంగా నష్టం చేకూర్చనుంది. ఇందులో హెచ్-1 తాత్కాలిక వర్క్ వీసాలు ప్రధాన లబ్ధిదారులు ఎక్కువగా భారతీయులు ఉన్నారు. కంపెనీల మధ్య బదిలీలు వంటి ఉపాధి ఆధారిత వర్గాలకు ఈ పరిణామం షాకిచ్చేలా ఉంది. హెచ్-1బి వీసాల కోసం ప్రీ-రిజిస్ట్రేషన్ కోసం రుసుము ప్రస్తుతం 10 నుండి 215కి పెంచారు. 70 శాతం హెచ్-1బీని కలిగి ఉన్న వారికి ఏకంగా 460 నుండి 780 డాలర్లకి 201 శాతానికి పెంచాలని ప్రతిపాదించబడింది.

అమరికాలో ఇంట్రా-కంపెనీ బదిలీల కోసం ఎల్ వీసా దారులకు 460 నుండి 1385 వరకు.. అసాధారణ నైపుణ్యాలు కలిగిన కార్మికుల వర్గానికి 129 శాతం పెంచడం విదేశీ పనిదారులకు శరాఘాతంగా మారింది. పెట్టుబడిదారులు వ్యవస్థాపకుల కోసం ఈబీ-5 వయాస్ - మిలియనీర్స్ వీసా అని కూడా పిలుస్తారు. ఇది కూడా ఖరీదైనదిగా మారుతుంది ప్రస్తుతం 3675 నుండి 204 శాతం పెరిగి 11160కి చేరుకుంది.

కొన్ని ఛార్జీలు అలాగే ఉండేలా ప్రతిపాదించబడ్డాయి. ప్రత్యేకంగా అన్ని రకాల వీసాల ప్రీమియం ప్రాసెసింగ్ - 2500 వద్ద ఉన్నాయి. ఇవి కొన్ని తగ్గించబడతాయి. స్పెషాలిటీ వృత్తులలో స్థానికంగా అందుబాటులో ఉన్న కార్మికుల కొరతను చక్కదిద్దేందుకు అమెరికా కంపెనీలలో పని చేసేందుకు విదేశీయులకు హెచ్-1బీ ప్రోగ్రామ్ కింద అమెరికా సుమారు 85000 వీసాలను మంజూరు చేస్తుంది. ఈ వీసాలలో దాదాపు 75 శాతం భారతీయులకు వెళ్తాయి. అమెరికా పాఠశాలలు మరియు కళాశాలల నుండి లేదా ఉద్యోగం పొందిన భారతీయులు ఇందులో ఉంటారు. మెరికా పౌరసత్వం ఇమ్మిగ్రేషన్ సేవల యొక్క మదర్ ఏజెన్సీ అయిన డిపార్ట్మెంట్ ఆఫ్ హోమ్ల్యాండ్ సెక్యూరిటీ ద్వారా మంగళవారం ఈ ప్రకటన జారీ చేశారు.. తదుపరి 60 రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరిస్తారు.

ఆ వ్యవధి ముగిసిన తర్వాత ప్రతిపాదిత లేదా సవరించిన ధరల వద్ద వారికి తెలియజేయబడుతుంది. యూఎస్.సీఐఎస్ లో సమగ్ర రుసుము సమీక్షించారు. 2016 నుంచి మారకుండా ఉన్న ఏజెన్సీ ప్రస్తుత రుసుములు ఏజెన్సీ కార్యకలాపాల పూర్తి ఖర్చును తిరిగి పొందడంలో చాలా తక్కువగా ఉన్నాయని ఆ సమీక్ష నిర్ధారించింది అని ఏజెన్సీ పేర్కొంది.

కోవిడ్ -19 మహమ్మారి కారణంగా ఏజెన్సీ యొక్క 2020 ఆదాయం 40 శాతం తగ్గిపోయింది. తరిగిపోయిన నగదు నిల్వలు తాత్కాలిక నియామకాల స్తంభన మరియు శ్రామిక శక్తి యొక్క సమ్మేళనం కేసులను సకాలంలో తీర్పు చెప్పే సామర్థ్యాన్ని తగ్గించాయి ముఖ్యంగా ఇన్కమింగ్ కాసేలోడ్లు ప్రీ-పాండమిక్ స్థాయిలకు పుంజుకోవడంతో తక్కువ లేదా రుసుము లేని మానవతా కార్యక్రమాలకు డిమాండ్ పెరగడం ఈ ఆర్థిక సవాళ్లకు తోడైంది అందుకే రుసుములు పెంచాల్సి వచ్చిందని అమెరికా ప్రభుత్వం తెలిపింది. వార్షిక దిగుబడిని 2022-2023లో 3.28 బిలియన్ల నుండి అదే కాలంలో ప్రస్తుత రేట్లతో 5.2 బిలియన్లకు పెంచారు.

# మనిషి మెదడును తింటున్న గిరిజన తెగ.. ఎందుకోసమంటే..!



**గినియా:** నరమాంస భక్షకుల గురించి విన్నప్పుడు ఒక రకమైన భయాందోళన కలుగక మానదు. ఇలాంటి వాళ్లు చాలా అరుదుగా ఏ అడవుల్లోనో తలదాచుకుని కన్పించిన వారిపై దాడి చేసి భక్షిస్తుంటారు. చివరికి వీరంతా ఏదో ఒక భయంకరమైన రోగంతో మరణిస్తారు. ప్రస్తుతం భూమిపై నరమాంస భక్షకులు ఉన్నారో లేదో తెలియదు గానీ మనిషి మెదడు తినే ఒక తెగ మాత్రం ఉందని తాజాగా వెల్లడైంది.

యూనివర్శిటీ కాలేజ్ లండన్లోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూరాలజీ ప్రియాన్ యూనిట్ నుంచి జాన్ కాలింగ్ తన బృందం పాపువా న్యూ గినియాలో చేపట్టిన పరిశోధనలో మనిషి మెదడును తినే తెగ ఒకటి ఉందనే విషయం వెలుగు చూసింది. ఈ ప్రాంతంలో సుమారు 312 తెగలు నివసిస్తున్నాయి. వీరిలో ఒక తెగ విచిత్రమైన ఆచారాలకు ప్రసిద్ధి చెందినట్లు జాన్ కాలింగ్ బృందం గుర్తించింది. సైంటిఫిక్ ఫోర్ ట్రైబ్ తెగకు చెందిన వారంతా అంత్యక్రియల సమయంలో మనిషి మెదడును తింటున్నారని పరిశోధనలో తేలింది. ఈ తెగ వారు చనిపోయిన తమ బంధువుల మెదళ్లను ఆహారంలో చేర్చుకొని తింటున్నారు. దీని వల్ల ఈ తెగ 'కురు' అనే వ్యాధికి జన్యు నిరోధక శక్తిని పెంచుకున్నారని ప్రియాన్ యూనిట్ అధ్యయనంలో వెల్లడైంది. కురు వ్యాధి 'మ్యాడ్ కౌ' వ్యాధిని పోలి ఉంటుంది.

ౢ వ్యాధి.. చిత్తవైకల్యం వంటి 'ప్రియాన్' వ్యాధులకు కొత్త చికిత్సలను కనుగొనడంలో ఈ పరిశోధన ఉపయోగపడే అవకాశం ఉందని జాన్ కాలింగ్ బృందం అభిప్రాయపడుతోంది. ఫోర్ తెగలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియల సమయంలో మరణించిన వారి బంధువులు మాంసాన్ని తిని విందు చేసుకుంటారు.

మహిళలు మృత దేహంలోని మెదడును తింటారట. ఇది వారికి ప్రియమైన గౌరవ చిహ్నంగా పరిగణిస్తారట. పురుషులేమో మృతదేహం శరీర భాగాలు తింటారట. మృతదేహాన్ని ఖననం చేసిన.. సమాధి చేసినా కీటకాలు తింటాయని ఈ తెగ నమ్ముతుంది. చనిపోయిన వ్యక్తిని ప్రేమించిన వారు తినడం వల్ల మంచి కలుగుతుందని ఈ తెగ నమ్ముతుంది.


ఈ మేరకు ఈ గిరిజన తెగ స్త్రీలు మెదడును తీసి దానికి ఫెర్న్ వేసి వెదురులో వండుతారట. పిత్తాశయం తప్ప అన్నీ వేయించుకుని తింటారట. కానీ మనిషి మెదడులో ప్రాణాంతకమైన అణువు ఉందని.. అది తింటే మరణిస్తారనే సంగతి వీరికి తెలియదు. కాగా 1950లలో కురు వ్యాప్తి చెందిన తరువాత న్యూ గినియాలో మానవ మెదడును తినడం ప్రభుత్వం నిషేధించబడింది. అయితే ఫోర్ తెగను పరిశోధిస్తున్న శాస్త్రవేత్తలకు మెదడు తినే అలవాట్ల ఫలితంగా ఈ తెగ వారిలో కురు.. ప్రియాన్ల వల్ల కలిగే ఇతర వ్యాధులకు జన్యు రోగనిరోధక శక్తి అభివృద్ధి చెందినట్లు గుర్తించారు. ఈ పరిశోధన ఫలితాలు అల్జీమర్స్.. పార్కిన్సన్స్ వంటి న్యూరో డిజె నెరేటివ్ వ్యాధులకు చికిత్సలు కనుగొనడంలో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# అమెరికాలో మరో రోడ్డు ప్రమాదం..


**అమెరికా :** ఒభారతీయ సంతతికి చెందిన ఒక వైద్యుడు అమెరికాలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి తన టెస్లా కారులో కొండపైనుంచి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వారందరినీ రక్షించి ఆసుపత్రికి తరలించారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో పసాదేనాకు చెందిన భారతీయ వైద్యుడు ధర్మేష్ ఎ పటేల్ ఉద్దేశపూర్వకంగా ఇలా చేసాడని సమాచారం. ధర్మేష్ తన భార్య పిల్లలతో కలిసి కొండపైనుంచి కారుతో కిందకు పోనిచ్చాడు. ఆత్మహత్యాయత్నం చేసినట్టు సమాచారం.

ధర్మేష్ ఆసుపత్రి నుండి విడుదలైన తర్వాత అరెస్ట్ చేసి శాన్ మాటియో కౌంటీ జైలుకు పంపుతామని పోలీసులు తెలిపారు. ధర్మేష్ పటేల్ అతని కుటుంబం సోమవారం శాన్ మాటియో కంట్రీలోని డెవిల్స్ స్లైడ్ అనే కొండపైనుంచి కారుతో లోయలోకి పోనిచ్చారు.

ఈ ప్రమాదంలో అతడి పిల్లలు 7 ఏళ్ల బాలిక 4 ఏళ్ల బాలుడిని రక్షించడానికి అగ్నిమాపక సిబ్బంది కొండపైకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. హెలికాప్టర్ తో ఈ పిల్లలను ఈ వైద్య దంపతులను వాహనం నుండి రక్షించి ఆస్పత్రికి తరలించారు. 250 నుంచి 300 అడుగుల లోయలో కిందకు పడిన తర్వాత కూడా ఓ మోస్తరు గాయాలతో వీరంతా ప్రాణాలతో బయటపడిన అరుదైన ఘటనగా దీన్ని అభివర్ణిస్తున్నారు. కారు సీట్లలో ఉన్న పిల్లలు సీట్ బెల్ట ద్వారా రక్షించబడ్డారు. టెస్లా కారులోని అత్యాధునిక ఫీచర్లు కూడా వీరు ప్రమాదం బారిన పడకుండా కాపాడయని పోలీసులు చెబుతున్నారు. మిస్టర్ పటేల్పై మూడు హత్యాయత్నాలు రెండు పిల్లలపై వేధింపుల ఆరోపణల కేసు నమోదు చేయాలని అధికారులు ప్లాన్ చేస్తున్నారు.




# 15 ఏళ్లలో అత్యధిక పౌరసత్వాలు జారీ.. అమెరికాలో ఇదో రికార్డ్



**అమెరికా :** అగ్రరాజ్యం అమెరికాలో ఉద్యోగం చేయాలని.. ఉపాధి లభించాలని అందరూ ఆ కలల ఫ్లైట్ ఎక్కేస్తారు. అక్కడ డాలర్లు సంపాదించి బాగా బతకాలని కలలుగంటారు. కానీ కొందరే ఇందులో సక్సెస్ అవుతారు. సక్సెస్ అయిన వారు తిరిగి చూడకుండా బతుకుతారు. అమెరికా కూడా తమ దేశానికి ప్రయోజనం చేకూర్చే ఎంతో మందిని స్వాగతిస్తోంది. తమలో కలుపుకుంటోంది. అందుకే అత్యధిక పౌరసత్వాలు జారీ చేస్తోంది. 2022లో అత్యధికంగా 1 మిలియన్ వలసదారులు అమెరికాలో ఆ దేశ పౌరులుగా మారారు. ఇది దాదాపు 15 సంవత్సరాలలో అత్యధిక సంఖ్య కావడం విశేషం. కోవిడ్-19 కారణంగా పెరిగిన బ్యాక్లాగ్ ఎట్టకేలకు క్లియర్ చేయబడింది. ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న చాలా మందికి నూతన సంవత్సర కానుకగా దేశ పౌరసత్వాన్ని అమెరికా అందించింది. యునైటెడ్ స్టేట్స్ సిటిజన్షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ ప్రకారం భారతదేశం క్యూబా ఫిలిప్పీన్స్ మెక్సికో మరియు డొమినిక్ రిపబ్లిక్ నుండి ఎక్కువ మంది కొత్త పౌరులు అమెరికాకు వచ్చారు. కరోనా మహమ్మారి కారణంగా పౌరసత్వ ఇంటర్వ్యూలు వేడుకలు నిలిపివేయబడ్డాయి. ప్యూ రీసెర్చ్ సెంటర్ కారణంగా జూన్ 2022 చివరి నాటికి దరఖాస్తుల బ్యాక్లాగ్ 673000కి చేరుకుంది.

ఇమ్మిగ్రేషన్ సిబ్బంది కూడా మహమ్మారి కారణంగా సమస్యలను ఎదుర్కొంది. ఎందుకంటే ముఖాముఖి ఇంటర్వ్యూలు కావడంతో ఈ ప్రక్రియను నిలిపివేశారు. దరఖాస్తులన్నీ పెండింగ్ లో పడిపోయాయి. రుసుములు చెల్లించి మరీ చాలా మంది నిరీక్షించారు.

అలాగే మే 2020 మరియు ఏప్రిల్ 2021 మధ్య నియామక స్తంభన చోటుచేసుకుంది. ఇది పెండింగ్లో ఉన్న దరఖాస్తులను మరింత పెంచింది. ఇప్పుడు ఇమ్మిగ్రేషన్ డిపార్ట్మెంట్ ఆఫ్ స్టేట్ లు కలిసి పౌరసత్వం దరఖాస్తులు క్లియర్ చేసింది. మహమ్మారికి ముందు మాదిరిగానే 2022లో ఉపాధి ఆధారిత వలస వీసాల సంఖ్య కంటే రెండింతలు జారీ చేసింది.

అయినప్పటికీ టైటిల్ 42 మెక్సికోలో రిమైన్ వంటి చట్టాలు మెక్సికో నుంచి వచ్చిన అనేక మంది వలసదారులకు పౌరసత్వం అమెరికాలో దక్కడం లేదు. ఇంకా ఆ సమస్య వెంటాడుతూనే ఉంది. అమెరికా న్యాయస్థానాలు ఈ సమస్యపై విచారణ జరుపుతున్నాయి. చట్టాలను సరళీకరించడానికి తమ వంతు కృషి చేస్తున్నాయి.

# దిగ్గజ కంపెనీల లేఆఫ్.. మళ్లీ ఉద్యోగుల తొలగింపు షూరు..!

అమెరికా కరోనా సమయంలో ఐటీ.. బడా కంపెనీలన్నీ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం అవకాశం కల్పించాయి. దీంతో తమ ఉద్యోగానికి ఢోకా లేదని వారంతా భావించారు. అయితే కరోనా పరిస్థితులు తగ్గుముఖం పట్టిన తర్వాత కంపెనీలు ఉద్యోగులను వరుసబెట్టి తొలగిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. 2022 లో న్యూయార్క్ వ్యాలీలోని బడా ఐటీ కంపెనీలు వేలాది మంది ఉద్యోగులకు తొలగించాయి. మెటా.. అమెజాన్.. ట్విట్టర్.. ప్రముఖ కంప్యూటర్ తయారీ సంస్థలు హెచ్పీ.. డెల్ వంటి కంపెనీలు ఉండటం విశేషం. రాబోయే రోజుల్లో ఉద్యోగుల తొలగింపు తప్పదనే సంకేతాలను ఆయా కంపెనీలు ముందుగానే పంపించాయి.

గత కొన్నిరోజులుగా ఉద్యోగుల తొలగింపు ప్రక్రియకు విరామం ప్రకటించిన ఐటీ తదితర కంపెనీలు 2023 ప్రారంభంలో మళ్లీ తొలగింపులకు సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు అమెజాన్ కంపెనీ సుమారు 18 వేల ఉద్యోగులను తొలగిస్తున్నట్లు గురువారం అధికారికంగా ప్రకటించింది. దీని ప్రభావం అమెజాన్ స్టోర్స్.. పీపుల్.. ఎక్స్ పీరియన్స్ అండ్ టెక్నాలజీలపై పడుతుందని భావిస్తున్నారు. ఈ విషయంపై అమెజాన్ సీఈఓ ఒక ప్రకటనలో స్పందిస్తూ.. ముందుగా పేర్కొన్న విధంగా వార్షిక ప్రణాళిక ప్రక్రియ పూర్తి చేయలేదన్నారు. 2023 ప్రారంభంలో మరింత మంది ఉద్యోగుల తొలగింపులు ఉంటాయని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.




జనవరి 18 నుంచి ప్రభావితమైన ఉద్యోగులతో కమ్యూనికేట్ చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. కాగా గత నవంబర్లో ఇ-కామర్స్ బెహెమోత్ తన శ్రామిక శక్తిని దాదాపు 1 వేల మంది తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుందని నివేదికలు వెలువడ్డాయి. 2022 సెప్టెంబర్ కంపెనీలో మొత్తం 1.5 మిలియన్ల మంది ఉద్యోగులు ఉన్నట్లు వెల్లడించింది. మేటా గతేడాది 11వేల ఉద్యోగులను తొలగించింది. అయితే చిప్ మేకర్.. ఇంటెల్ ఈ ఏడాదిలో గణనీయంగా ఉద్యోగుల్లో కోతలు పెట్టేందుకు సిద్ధమైంది. గూగుల్ సైతం 2023 ప్రారంభంలోనే ఉద్యోగులను తొలగించాలని యోచిస్తోంది.

# జాతీయ స్థాయిలో నెంబర్-1 స్థానంలో సింగరేణి థర్మల్

పెద్దపల్లి .సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం అత్యధిక ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ ఎఫ్) సాధించి ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికాంతానికి (ఏప్రిల్ నుంచి డిసెంబరు 31 నాటికి) మరోసారి దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచి తన ప్రతిభను చాటింది.

సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ వారు రూపొందించిన దేశంలోని అత్యుత్తమ 25 థర్మల్ విద్యుత్ కేంద్రాల జాబితాలో అత్యధికంగా 91.15 శాతం పీఎల్ఎఫ్ తో సింగరేణి థర్మల్ ప్లాంట్ నెంబర్ వన్ స్థానంలో నిలిచింది. దేశంలో గల సుమారు 250కి పైగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ థర్మల్ విద్యుత్ కేంద్రాల పీఎల్ఎఫ్ లను దాటి సింగరేణి థర్మల్ ప్లాంట్ ఈ స్థానాన్ని అందుకోవడం ఈ ఆర్థిక సంవత్సరంలో ఇది రెండో సారి.

దీనిపై సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.శ్రీధర్ తన హర్షం ప్రకటిస్తూ ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన తమ సంస్థ జాతీయ స్థానంలో అగ్రస్థానంలో నిలవడం తమకెంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడంలో అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

అతి తక్కువ సమయంలో అగ్రస్థానానికి ఎదిగిన సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం2016 ఆగస్టు లో ప్రారంభమైన సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం కేవలం ఆరు సంవత్సరాల కాలంలోనే తన అద్భుతమైన ప్రతిభతో దేశంలో అగ్రస్థానంలో నిలుస్తూ వస్తోంది. కరోనా సమయంలో మినహా మిగిలిన అన్ని సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వాల నిర్వహణ లో ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాల కన్నా అత్యధిక పీఎల్ఎఫ్ సాధిస్తూ ఈ విభాగంలో దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచింది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో గత నవంబరు నెల నుంచి ప్రభుత్వ సంస్థ లతో పాటు అన్ని ప్రైవేట్ సంస్థలు నిర్వహిస్తున్న 250 కి పైగా ఉన్న థర్మల్ కేంద్రాల కన్నా అత్యధిక పీఎల్ఎఫ్ నమోదు చేస్తూ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం గమనార్హం. దేశంలో ప్రముఖ ప్ర భుత్వ, ప్రైవేట్ విద్యుత్ సంస్థలైన ఎన్టీపీసీ, అదానీ, టాటా, రిలయన్స్, జిందాల్ తదితర సంస్థల ను కూడా దాటి నెంబర్ వన్ గా నిలవడం గమనార్హం. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ పరిశ్రమలు పలు అభివృద్ధి సూచికల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తూ ఆదర్శవంతంగా ఉంటున్న నేపథ్యంలో తెలంగాణ పరిశ్రమ అయిన సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం కూడా అదే బాటలో తన అద్భుతమైన ప్రతిభను ప్రదర్శిస్తూ రాష్ట్రానికి మంచి పేరు తెస్తోంది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ వెల్లడించిన నివేదికలో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ 7219 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తితో 91.15 పీఎల్ఎఫ్ తో ప్రథమ స్థానంలో నిలవగా.. తర్వాత స్థానంలో ఛత్తీస్ గఢ్ రాష్ట్రానికి చెందిన ఎన్టీపీసీ వారి కోర్బా ప్లాంట్ నిలిచింది. మూడో స్థానంలో ఎన్టీపీసీ వారి సింగ్రౌలి( ఉత్తర ప్రదేశ్ ) ప్లాంట్ నిలిచింది. నాలుగో స్థానంలో వింధ్యాచల్ ప్లాంట్(మధ్య ప్రదేశ్), ఐదో స్థానంలో బక్రేశ్వర్ ప్లాంట్ (పశ్చిమ బెంగాల్),



**ఆరో స్థానంలో రిహాంద్ ప్లాంట్( ఉత్తర ప్రదేశ్) నిలిచాయి.**

రాష్ట్ర ప్రగతికి విద్యుత్ అందిస్తూ ... సింగరేణికి లాభాలు పంచుతూ..

కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడంలో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం తనవంతు పాత్రను సమర్థంగా నిర్వహిస్తూ రాష్ట్ర ప్రగతిలో పాలుపంచుకుంటోంది. ఇప్పటి వరకు ఈ థర్మల్ విద్యుత్ కేంద్రం 52328 మిలియన్ యూనిట్ల విద్యుత్ ను గ్రిడ్ కు అందించి తెలంగాణ వినియోగిస్తున్న మొత్తం విద్యుత్‌లో 12 శాతాన్ని సమకూర్చుతోంది. అలాగే సింగరేణి సంస్థ కు ఏటా సగటున 400 కోట్ల రూపాయలకు పైగా లాభాలను కూడా అందిస్తోంది. నెలావారీ పనితీరును పరిశీలిస్తే రెండో యూనిట్ ఇప్పటికి 10 సార్లు వంద శాతం పీఎల్ఎఫ్ దాటి విద్యుత్ ను ఉత్పత్తి చేసింది. మొదటి ప్లాంట్ ఎనిమిది సార్లు నూరు శాతం పీఎల్ఎఫ్ ను దాటడం విశేషం.

ఈ ప్లాంట్ నిర్మాణాన్ని ప్రత్యేక చొరవతో అతి తక్కువ సమయంలో పూర్తి చేయించిన సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.శ్రీధర్ అనంతరం కూడా క్రమం తప్పకుండా ప్రతీ నెలా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ ప్లాంట్ పురోగతికి దిశా నిర్దేశం చేస్తున్నారు. ఫలితంగా ఈ ప్లాంట్ పీఎల్ ఎఫ్ లోనే కాకుండా ఫ్లైయాష్ మేనేజ్మెంట్, వాటర్ మేనేజ్మెంట్, ఎనర్జీ ఎఫిషియెన్సీ వంటి అంశాల్లో అద్భుత ప్రతిభ చూపుతూ పలు జాతీయ స్థాయి అవార్డులు అందుకుంది.

**ముఖ్యమంత్రి ఆదేశంతో త్వరలోనే మరో ప్లాంట్...**

సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు పెరుగుతున్న రాష్ట్ర విద్యుత్ అవసరాలకు తోడ్పడేందుకు మరో 800 మెగావాట్ల ప్లాంట్ ను థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రాంగణం లోనే ఏర్పాటు చేయాలని ఆదేశించగా.. ఇప్పటికే దీనికి సంబంధించిన సమగ్ర ప్రణాళిక కూడా సమర్పించి అనుమతి పొందడం జరిగింది.

ఈ నెలలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి మార్చి నెల నుంచి నిర్మాణపు పనులు ప్రారంభించాలని, కాలపరిమితికి లోపే పనులు పూర్తి చేయాలని ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశించగా.. దీనిపై డైరెక్టర్(ఈ అండ్ ఎం) శ్రీ డి.సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో పనులు వేగంగా నడుస్తున్నాయని తెలిపారు.

## మంథనిలో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి..



మంథని: బీజేపీ పార్టీ ఆఫీస్‌లో నియోజకవర్గంలోని అన్ని మండలల అధ్యక్షులు, మండలల ఇంచార్జ్ లు, మండలల ప్రధాన కార్యదర్శుల, జిల్లా సీనియర్ నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశనికి ముఖ్య అతిధులుగా జిల్లా ఇంచార్జ్ రావుల రాంనాథ్ ,ప్రబరి అనిల్ బీజేపీ రాష్ట్ర నాయకులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, పాల్గొన్నారు.

అనంతరం వారు మాట్లాడుతూ.. మంథని లో బీజేపీ రోజు రోజుకు విపరీతంగా బలపడుతుంది, ప్రతిఒక్కరూ గెలుపే లక్ష్యంగా పని చేయాలి కెసిఆర్ నియంత, కుటుంబ పాలనకి బీజేపీ తో స్వస్తి పలుకుదాం, గ్రామ స్థాయి నుండి బూత్ కమిటీ లను పూర్తి చేయాలి, ఈనెల 7వ తేదీన బూత్ కమిటీ సభ్యులతో మంథని ఎస్ ఎల్ బి ఫంక్షన్ హాల్ లో బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డ తో వర్చువల్ మీటింగ్ ఉంటుందని, ఈ ప్రాంతం నుండి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీధర్ బాబు నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి చుట్టం చూపుగా నియోజకవర్గం లో తిరుగుతున్నాడు, మన ప్రాంతం నుండి బొగ్గు ఇసుక నీళ్లు నిధులు తరలించకు పోతు మంథని ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారు.

మండలాలలో పార్టీని మరింతగా పటిష్టం చేయడానికి కొత్త ఇన్చార్జిలను నియమించడం జరిగిందని, రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా బిజెపి అధికారం లోకి వస్తుంది అన్నారు ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండపాక సత్య ప్రకాష్, మహావాది రామన్న,విజయ్ కుమార్,మండల అధ్యక్షులు వేల్పుల రాజు, జంగపల్లి అజయ్, మల్కామోహన్ రావ్, సిరిపురం శ్రీమన్నారాయణ, బొమ్మన భాస్కర్ రెడ్డి, కోయల్ కార్ నిరంజన్, మండలల ఇంచార్జ్ లు బోగోజు శ్రీనివాస్, మట్ట శంకర్, ఎడ్ల సదశివ్, బిరుదు గట్టయ్య, ఉడుముల విజయ రెడ్డి, బండ వసంత రెడ్డి, మచ్చగిరి రాము, ఆకుల శ్రీధర్, పగే రంజిత్, చిలువేరి సతీష్, మండల ప్రధాన కార్యదర్శులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఛైర్మెన్ పుట్ట మధుకర్ కి మున్సిపల్ ఛైర్పర్సన్ పుట్ట శైలజ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు.

మంథని: పట్టణంలోని రాజగృహాలో పట్టణంలోని మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల ప్రకృతి వైపరీత్యాల ద్వారా సంభవించిన భారీ వరదల్లో పాడైపోయిన సైన్స్ ప్రయోగశాల పునరుద్ధరణకు పూనుకుని వెనువెంటే మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ప్రతిపాదనలు పంపిన పెద్దపల్లి జిల్లా పరిషత్ ఛైర్మన్ పుట్ట మధుకర్ కి మరియు మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి పుట్ట శైలజ ని మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలియజేసి హర్షం వ్యక్తం చేసిన మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు.

## రచ్చపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీలో పర్యటించిన జడ్పీ ఛైర్మన్ పుట్ట మధూకర్

మంథని: మండలం రచ్చపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీ లో ఉదయాన్నే పర్యటించి గ్రామంలో ఇటీవల మరణించిన సిద్ధ రాజయ్య, ఉదరి మౌనిక కుటుంబాలను పరామర్శించిన పెద్దపల్లి జిల్లా పరిషత్ ఛైర్మన్ పుట్ట మధూకర్.

## జిల్లా గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

సిరిసిల్ల, 05 జనవరి: ప్రపంచంలో పుస్తకాన్ని మించిన మహత్తరమైన వస్తువు ఏది లేదని అన్నారు రాజన్న సిరిసిల్ల జిల్ల గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య. గురువారం జిల్ల గ్రంథాలయ సంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సిరిసిల్లకు చెందిన స్వర్గీయ గెంట్యాల జయంత్ కుమార్ స్మారకార్థం అతని కుటుంబ సభ్యులు సిరిసిల్ల జిల్లా గ్రంథాలయ సంస్థకు 150 పుస్తకాలను అందించారు. పాఠకుల ఉపయోగార్థం పుస్తకాలను అందించిన తులసీదాస్ కు ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య అభినందించారు. ఈ సందర్భంగా జిల్ల గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య మాట్లడుతూ.. పుస్తకాలు వెలకట్టలేనివని, పుస్తకాన్ని మించిన మహత్తరమైన వస్తువు ఈ ప్రపంచంలో ఏది లేదని అన్నారు. జిల్లాలో పుస్తకాలు పంపిణీ చేయాలనుకుంటున్న దాతలు ముందుకు వచ్చి నిరుద్యోగులైన పాఠకులకు ఉపయోగపడు పుస్తకాలను అందించవలసిందిగా ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కమలాకర్, వెంగళ శ్రీనివాస్, గెంట్యాల తులసి దాసు పాల్గొన్నారు.

## 100 కోట్ల కుంభకోణాన్ని బయటపెడుతున్నాం ఆది శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు



వేములవాడ, 100 కోట్ల కుంభకోణాన్ని బయటపెడుతున్నామని జిల్లా కాంగ్రెస్ నాయకుడుఆది శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూస్థానిక ఎమ్మెల్యే రమేష్ బాబు 100 కోట్ల కుంభకోణాన్ని బయటపెడతానని వ్యాఖ్యలు చేసి జర్మని వెళ్ళాడని, కుంభకోణంపై వ్యాఖ్యలు చేసి నెలలు గడుస్తున్న బయట పెట్టకపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులుగా ప్రజా సమస్యలపై అంకితభావంతో అన్ని ఆధారాలతో రేపు ప్రజల సమక్షంలో 100 కోట్ల కుంభకోణాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బయటపెడుతున్నామన్నారు. దీంతో వేములవాడలో అధికార పార్టీ నాయకులతో పాటు ప్రతిపక్ష పార్టీ నాయకుల్లో ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలు ఉత్కంఠ రేపుతున్నాయి.

## నిర్విఘ్నంగా మై వేములవాడ ట్రస్ట్ సేవలు150 మందికి అన్నదానం



వేములవాడ, మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ఆధ్వర్యంలో దాతల అందిస్తున్న విరాళాలతో నిర్వహించబడుతున్న అన్నదాన కార్యక్రమం 603 వ రోజుకు చేరుకున్నాయి. అన్నదాన కార్యక్రమములో భాగంగా శుక్రవారం 150 మంది అన్నార్థులకు, యాచకులకు రాజన్న ఆలయ పార్కింగ్ స్థలంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ట్రస్టు సభ్యులు తెలియజేశారు

అన్నదాతలుగా అమెరికా వాస్తవ్యులు చోల్లేటి శ్రీనాథ్ ఉమా దంపతులు, జవ్వాజి శేఖర్, అదిపెల్లి శ్రీకాంత్, వొడ్యాల వేణు, మామిడ్ల సంతోష్ మానస దంపతులు, పులి శిరీష మధు గౌడ్ దంపతులు, పులి దివ్య రాజు గౌడ్, చందనం రామకృష్ణ చందన్ రజిత దంపతులు, శాశ్వత దాతలుగాలి జువ్వాడి వెంకటేశ్వర రావు స్నేహాలత దంపతులు, ప్రతాప సంపత్, నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు, రొక్కం నర్సింహారెడ్డి వున్నారు.

నేటి అన్నదాన కార్యక్రమంలో మధు మహేష్, నాగుల చంద్రశేఖర్, చల్లా సత్తయ్య, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, ప్రతాప నటరాజు, జూలపెల్లి రాజు, పాత సంతోష్, గుమ్మడి మల్లేష్ యాదవ్, కూరగాయల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



### - వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు

కోరుట్ల ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ లు అన్నారు. గురువారం కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్, నూతన బస్తి దవాఖానను కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ద్వారా ఆడపిల్లలు పుడితే 13,వేలు, మగ బిడ్డ పుడితే 12,వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తున్నామన్నారు. కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిని 20,కోట్ల రూపాయలు నిధులు వెచ్చించి 30,పడకల నుండి 100,పడకల ఆసుపత్రిగా అప్డేట్ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో తెలంగాణలో కేవలం మూడు డయాలసిస్ కేంద్రాలు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం డయాలసిస్ కేంద్రాలను 122,కు పెంచామని చెప్పారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు 2,వేల రూపాయల పెన్షన్ అందించడంతో పాటు రవాణా చార్జీలను సైతం అందిస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఒక డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారు. బస్తీ దవాఖానలో పేద ప్రజలకు ఉచిత పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు అందజేస్తామని చెప్పారు. త్వరలో పల్లె దవాఖానలు ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 6,వేల ఐసీయూ బెడ్లు మంజూరు చేశామన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించేందుకు కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండు కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభించినట్లు చెప్పారు.

వచ్చే సంవత్సరం మరో రెండు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇటీవల 90,మంది కొత్త వైద్యులను నియమించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వైద్య సేవల్లో దేశంలో నే మూడవ స్థానంలో నిలిచిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నా గానీ ప్రతిపక్షాలు అనవసరమయిన రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు. దేశవ్యాప్తంగా 16,లక్షల ఉద్యోగ ఖాళీలను కేంద్రం ఎందుకు భర్తీ చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి నిత్యం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చి ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నట్లు తెలిపారు.కేసీఆర్ సారధ్యంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి.రవి, జడ్పీ ఛైర్మన్ దావ వసంత, చైర్పర్సన్ అన్నం లావణ్య అనిల్, వైస్ ఛైర్మన్ గడ్డమీది పవన్, జడ్పీటిసి దారిశెట్టి లావణ్య, ఎంపిపి తోట నారాయణ, పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పండుగ వాతావరణాన్నీ తలపించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి "బర్త్ డే" వేడుకలు

**క్రేన్ ద్వారా భారీ గజమాలతో**
**ఎమ్మెల్సీ "జీవన్"కు సత్కారం**
**ఎమ్మెల్సీ స్వగ్రామం బతికేపల్లిలో జన్మదిన వేడుకలు**
**రక్తదానం చేసిన కార్యకర్తలు,**
**శుభాకాంక్షలు తెలిపిన నాయకులు**
**అభిమానుల కోలాహలం**
**మధ్య "బర్త్ డే" కేక్ కట్ చేసిన జీవన్ రెడ్డి**



జగిత్యాల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను పండుగ వాతావరణాన్నీ తలపించే విధంగా కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు జగిత్యాలలో ఘనంగా నిర్వహించారు.

గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జీవన్ రెడ్డి స్వగృహం కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు, ఉద్యోగులు, న్యాయవాదులు , ప్రజా, కుల సంఘాలు నాయకులు జీవన్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలుపడంతో సందడిగా మారింది. కేకులు, పూల బోకెలు, స్వీట్లు, శాలువాలతో తమ "ప్రజా నాయకుడిని" సన్మానించి అభిమానాన్ని చాటుకున్నారు.

భారీ గజమాలను క్రెన్ సహాయంతో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని కాంగ్రెస్ అభిమానులు సత్కరించారు. జన్మదిన వేడుకల సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి అభిమానులు తీసుకువచ్చిన భారీగజమాలను క్రెన్ సహాయంతో రోడ్డు మీద బహుకరించడంతో ఆప్రాంతం కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో కిక్కిరిసిపోయి ట్రాఫిక్ స్థంభించిపోయింది.

జగిత్యాలలోని ఇందిరా భవన్ లో కాంగ్రెస్ కార్యకర్తల సమక్షంలో జీవన్ రెడ్డి బర్త్ డే కేకు కట్ చేసి నాయకులకు తినిపించి అభిమానుల కోలాహలం మధ్య సంబరాలు జరుపుకున్నారు.నా శేష జీవితం ఏ స్థాయిలో ఉన్న చివరి క్షణం వరకు ప్రజా సేవకే అంకితమని అభిమానుల కేరింతల మధ్య ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు టీ. విజయలక్ష్మి దేవెందర్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్, పీసీసీ సభ్యులు గిరి నాగభూషణం, బండ శంకర్, కౌన్సిలర్ నక్క జీవన్, మాజీ కౌన్సిలర్లు గాజుల రాజేందర్, రేపల్లె హరికృష్ణ, పుప్పాల అశోక్, అల్లాల సరిత రమేష్ రావు, బింగి రవి, సుమ, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండా మధు,జిల్లా మైనార్టీ జిల్లా అధ్యక్షులు మన్సూర్,

జగిత్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షులు జున్ను రాజేందర్,

బుగ్గారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేముల సుభాష్, జగిత్యాల క్లబ్ కార్యదర్శి లేపల్లి రవీందర్ రెడ్డి, మాజీ ఎంపిపి ధర రమేష్, పెండెం గంగాధర్, రఘువీర్ గౌడ్, తోట నరేష్, శేఖర్, రజినీకాంత్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

సిరా వెలుగు
తెలుగు దినపత్రిక
శుక్రవారం 06 జనవరి 2023



# అందాల వేదిక నడుము నాభి అందం చూపు తిప్పనివ్వదే

నందమూరి కళ్యాణ్ రామ్ నటించిన విజయదశమి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు వేదిక హీరోయిన్ గా పరిచయం అయ్యింది. ఆ సినిమా నిరాశ పర్చినా కూడా ఆఫర్లు మాత్రం కంటిన్యూగా వచ్చాయి. తెలుగు సినిమాల్లోనే కాకుండా కన్నడం.. మలయాళం మరియు తమిళ చిత్రాల్లో నటించింది. అప్పుడప్పుడు ఈ అమ్మడు హిందీలో కూడా మెరిసింది.తెలుగు లో ఈ అమ్మడు ప్రస్తుతం పెద్దగా ఆఫర్లు దక్కించుకోలేక పోతుంది కానీ తమిళం మరియు మలయాళంలో వరుసగా ఆఫర్లు దక్కించుకుంటుంది.ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో ఏకంగా అరడజను సినిమాలు ఉన్నాయి. ఈ ఏడాది వేదిక నటించిన సినిమాలు బ్యాక్ టు బ్యాక్ ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.సినిమాలతో ఇంత బిజీగా ఉన్నా కూడా ఈ అమ్మడి యొక్క ఫొటో షూట్స్ సోషల్ మీడియాలో రెగ్యులర్ గా వైరల్ అవుతూనే ఉంటాయి.తాజాగా వేదిక షేర్ చేసిన ఈ ఫొటోలు నెటిజన్స్ ను చూపు తిప్పుకోవడం లేదు.

మరీ ఇంత అందంగా ఉంటే ఎలా అమ్మడు అంటూ చిలిపిగా వేదిక ను తిడుతున్నట్లుగా ఆమె ఫొటోలకు కామెంట్స్ చేస్తున్నారు.ఇండస్ట్రీలో అడుగు పెట్టి 15 సంవత్సరాలకు పైగానే అయ్యింది.. వయసు నాలుగు పదులకు చేరువ అయ్యి ఉంటుంది. అయినా కూడా ఇంత అందం ఎలా సాధ్యం ఆమెకే తెలియాలి. స్లిమ్ బాడీతో తెల్లని స్పోర్ట్స్ బ్రా లో క్లీ వేజ్ షో చేస్తూ... బ్లూ జీన్స్ వేసి దాని మీద అందమైన నడుము మరియు నాభిని చూపిస్తున్న వేదిక ను తెలుగు హీరోలు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు అంటూ తెలుగు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# 100 కోట్ల పారితోషికం క్లబ్‌లో టాప్ 5 స్టార్లు




భారతీయ సినిమా వందేళ్ల చరిత్రలో టాలీవుడ్ 90ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని కలిగి ఉంది. ఇన్నేళ్లలో 100 కోట్ల క్లబ్ సినిమా అన్నదే ఒక ఘనకార్యం అనుకుంటే ఇప్పుడు ఏకంగా 1000 కోట్ల క్లబ్ 2000 కోట్ల క్లబ్ అంటూ ఆకాశమే హద్దుగా పరుగులు పెట్టిస్తున్నారు. ఇదంతా ఒకెత్తు అనుకుంటే ఇప్పుడు ఒక్కో టాలీవుడ్ కథానాయకుడు 100 కోట్ల పారితోషికం అందుకుంటూ సంచలనంగా మారుతున్నారు. ఈ జాబితాలో ఐదుగురు టాప్ హీరోల పేర్లు ఉన్నాయి.

ఒక్కో సినిమాకి రజనీకాంత్ 100 కోట్ల పారితోషికం అందుకున్నారని ఇంతకుముందు కథనాలొచ్చాయి.కానీ ఆ తర్వాత బాహుబలి ఫ్రాంఛైజీతో ప్రభాస్ సంచలనంగా మారాడు. ఈ ఫ్రాంఛైజీలో రెండు సినిమాలు దాదాపు 2200 కోట్లు వసూలు చేయడంతో అతడి స్టార్ డమ్ అమాంతం మారిపోయింది. బాహుబలి సక్సెస్ తర్వాత దేశంలోనే మోస్ట్ వాంటెడ్ పాన్ ఇండియా స్టార్ గా ప్రభాస్ ఎదిగాడు. అతడి సినిమాలకు బడ్జెట్లను పెంచారు. పారితోషికంగా పెద్ద మొత్తాలను అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ ఒక్కో సినిమాకి 100కోట్లు అందుకుంటున్నాడన్న చర్చ ఉంది.ప్రభాస్ -1వ వాడు కాగా.. రెండో స్థానంలో రామ్ చరణ్ పేరు వినిపిస్తోంది. ఆర్.ఆర్.ఆర్ చిత్రంతో 1000 కోట్ల క్లబ్ సినిమాలో హీరోలుగా చరణ్-తారక్ పేర్లు చేరాయి.

ఆ ఇద్దరూ వంద కోట్ల పారితోషికం అందుకునే దిశగా ముందడుగు వేస్తున్నారన్న టాక్ ఉంది. తదుపరి రామ్ చరణ్ శంకర్ తో భారీ బడ్జెట్ సినిమా కోసం 100 కోట్లు అందుకుంటున్నారని ఇప్పటికే కథనాలొచ్చాయి. ఈ సినిమాని దిల్ రాజు దాదాపు 450 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిస్తున్నారని సమాచారం.మరోవైపు ఆర్.ఆర్.ఆర్ భీమ్ పాత్రతో ఎన్టీఆర్ కూడా తన స్థాయిని పెంచుకున్నారు. అతడు ప్రస్తుతం కొరటాలతో సినిమా తర్వాత కేజీఎఫ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తో కలిసి పని చేయనున్నాడు. ఈ సినిమాకి దాదాపు 100 కోట్ల పారితోషికాన్ని డిమాండ్ చేసే అవకాశం ఉందని గుసగుస వినిపిస్తోంది.

తదుపరి రేస్ లోకి మహేష్ - పవన్ కల్యాణ్ దూసుకొస్తున్నారు. రాజమౌళి సినిమాతో మహేష్ 100 కోట్ల పారితోషికం క్లబ్ లోకి అడుగు పెడతాడని భావిస్తున్నారు. ఈ సినిమాకి ఏకంగా 500 కోట్లు మించిన బడ్జెట్ ని కేటాయిస్తున్నారన్న సమాచారం ఉంది.ఇక పుష్ప చిత్రంతో బన్నీ హవా దేశవ్యాప్తంగా కొనసాగింది. పుష్పరాజ్ గా అతడి నటనకు దేశ ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

అందుకే ఇప్పుడు పుష్ప 2 పై భారీ అంచనాలేర్పడ్డాయి. పుష్ప 2తో పాన్ ఇండియాలో కొట్టేస్తే బన్నీ కూడా పారితోషికంలో 100 కోట్ల క్లబ్ లో చేరతాడు. ఆ తర్వాత పవన్ కి వీరమల్లుతో ఛాన్సుందా లేదా? అన్నది తేలాల్సి ఉంది. ఈ సినిమాని కూడా బాహుబలి తరహాలో నే పాన్ ఇండియా కేటగిరీలో అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మిస్తుండడంతో అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. భారీ ప్యాకేజీల రూపంలో స్టార్ హీరోలు పారితోషికాలు అందుకుంటుండడం తెలిసిందే.

# టీం ఇండియాపై రెండో టీ-20 మ్యాచ్‌లో శ్రీలంక విజయం!




పుణెలో శ్రీలంక, టీం ఇండియా మధ్య జరిగిన రెండో టీ-20 మ్యాచ్‌లో శ్రీలంక విజయం సాధించింది. 207 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీం ఇండియా చివరి ఓవర్‌లో 21 పరుగులు చేయాల్సి వచ్చింది. అయితే శ్రీలంక కెప్టెన్ శనక చివరి ఓవర్‌లో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి కేవలం నాలుగు పరుగులే ఇచ్చాడు. దీంతో టీం ఇండియాపై శ్రీలంక 16 పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల టీ-20 సిరీస్‌లో రెండు జట్లు చెరో పాయింట్‌తో సమ ఉజ్జీలుగా నిలిచాయి.

టీం ఇండియా బ్యాట్స్‌మన్లలో అక్షర్ పటేల్ దూకుడుగా ఆడుతూ 19వ ఓవర్ వరకు 63 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.

కానీ చివరి ఓవర్‌లో లంక కెప్టెన్ శునక బౌలింగ్‌లో రెండు పరుగులు చేసి ఆలౌట్ కావడంతో టీం ఇండియా ఆశలు సన్నగిల్లాయి. అంతకుముందు 207 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీం ఇండియా బ్యాటర్లు రెండో ఓవర్‌కల్లా మూడు వికెట్లు సమర్పించుకున్నారు.

# క్రీడలు

## పాక్ క్రికెట్‌కు చేయాల్సినంత నష్టం చేశావు..




పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మాజీ ఛైర్మన్ రమీజ్ రాజాపై మాజీ పేసర్ మొహమ్మద్ అమిర్ విరుచుకుపడ్డాడు. చేసిందేమి లేదు.. కానీ చాలా మాట్లాడావు అంటూ విమర్శించాడు. మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడిన వాళ్లు మళ్లీ పాకిస్థాన్ జట్టుకు ఆడే అవకాశమే లేదు అంటూ ఈమధ్యే రమీజ్ రాజా, అమిర్‌ను ఉద్దేశించి అన్నాడు. దాంతో, చిర్రెత్తుకొచ్చిన అమిర్ నువ్వు పీసీబీ అధ్యక్షుడిగా చేసిందేం లేదు. కానీ.. చాలా మాట్లాడావు. నువ్వు పాక్ క్రికెట్‌కు చేసిన నష్టాన్ని పూడ్చేందుకు, ప్రస్తుతం పీసీబీ ఛైర్మన్ నజం సేథీకు ఎక్కువ సమయం పడుతుంది అని అమిర్ వ్యాఖ్యానించాడు. 2010లో మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు ఎదుర్కొన్న అమిర్ జట్టులో చోటు కోల్పోయాడు. ఆ తర్వాత క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. అయితే.. అమిర్ మళ్లీ పునరాగమనం చేస్తాడనే వార్తలు వినిపిస్తున్నాయి. పోయిన ఏడాది పాక్ జట్టు స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో దారుణంగా ఓడిపోయింది. దాంతో, పీసీబీ ఛైర్మన్ రమీజ్ రాజాపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. అతడిని మార్చాలంటూ మాజీలు సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టారు. నజం సేథీ కొత్త ఛైర్మన్‌గా నియమితుడయ్యాడు.

దాంతో, తనను దౌర్జన్యంగా తనను పదవిలోంచి తొలగిస్తున్నారని రమీజ్ అన్నాడు. 'గతంలో ఇమ్రాన్ ఖాన్ ప్రధానిగా ఉన్నప్పుడు నజం సేథీని కూడా అన్యాయంగా పీసీబీ చీఫ్ పదవి నుంచి తప్పించారు. అయన మౌనంగా వెళ్లిపోయారు. కానీ, నీలా రాద్ధాంతం చేయలేదు' అంటూ అమిర్ రాజాను విమర్శించాడు. పదవి పోయిన అక్కసుతో కొత్త పీసీబీ ఛైర్మన్‌ను నిందిస్తున్న రమీజ్ తీరును మాజీ క్రికెటర్లు కూడా తప్పుపడుతున్నారు.

Printed, published & owned by k. Srinivasa Rao . Printed at Sri balaji printing press H.No. 4-4-85,Thilak Road, KARIMNAGAR -505001(AP) Published at H.No. 1-95/2,MUPPIRITHOTA(V),ELIGAIDU(M), KARIMNAGAR DIST-505525.AP RNI NO. APTEL/2010/35251 EDITOR : K.Srinivasa Rao CELL : 9494494498